http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

బుధవారం 4 మార్చి 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 8 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828



## మౌనమే భారత ప్రతిష్ఠను తగ్గిస్తోంది

- ఖమేనీ మృతిపై మోదీ మాట్లాడాలి
- పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ఆందోళన వ్యక్తం చేసిన రాహుల్
- ఖమేనీ హత్యపై ప్రధాని మోదీ మౌనం వీడాలని వ్యాఖ్య


# ఉచిత విద్యుత్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



- ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలి
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలి
- విద్యావ్యవస్థలో తీసుకువస్తున్న మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

హైదరాబాద్

ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహించాలని, ఐదు దశల్లో 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సచివాలయంలో కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశం అయ్యారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికపై కలెక్టర్లకు దిశా నిర్దేశం చేస్తున్నారు. సమావేశంలో మంత్రులు, సీఎస్, ఉన్నతాధికారులు, కలెక్టర్లు పాల్గొన్నారు. : 99 రోజుల కార్యాచరణలో అందరి భాగస్వామ్యం ఉండాలని రేవంత్ రెడ్డి తెలిపారు. గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రేషన్ కార్డులు, సన్నబియ్యంపై లబ్ధిదారుల అభిప్రాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. విద్యావ్యవస్థలో తీసుకువస్తున్న మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రభుత్వ ఆస్పత్రులను మెడికల్ కాలేజీలతో అనుసంధానం చేయాలని, మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు ప్రతినెలా బిల్లుల చెల్లించాలని పేర్కొన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికకు నోడల్‌శాఖగా ప్రణాళికశాఖ వ్యవహరించనున్నారు. ఏప్రిల్ 2న గ్రామస్థాయి, ఏప్రిల్ 16న మండల స్థాయి కార్యక్రమాలు చేపట్టనున్నారు. మే 2న నియోజకవర్గస్థాయి, మే 22న జిల్లాస్థాయి కార్యక్రమాలు, ఈ నెల 6న ఉమ్మడి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నారు. 99 రోజుల్లో శాఖలవారీగా అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక పర్యవేక్షణకు ప్రత్యేక మొబైల్ యాప్ రూపకల్పించనున్నారు.



## ఇరాన్ సంక్షోభం

- భారత్ వద్ద ఉన్న చమురు నిల్వలు ఎంత?
- క్రూడ్ ఆయిల్ నిల్వలకు సంబంధించి భారత్ సేఫ్ జోన్ లో ఉన్నట్టే!
- దేశంలో ప్రస్తుతం 25 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు
- ఆఫ్రికా, రష్యా, అమెరికా నుంచి పెరిగిన చమురు దిగుమతులు
- ఇరాన్ యుద్ధం నేపథ్యంలో పెట్రో ఉత్పత్తుల ఎగుమతులపై ఆంక్షలు

## ఇరాన్ తాజాగా చర్చలకు ప్రయత్నించింది

- ఇప్పటికే చాలా ఆలస్యమైందని చెప్పాను: ట్రంప్
- ట్రూత్ సోషల్ లో ట్రంప్ పోస్ట్
- ఇరాన్ వాయుసేన, నావికాదళం, రక్షణ వ్యవస్థలు ధ్వంసమైనట్లు వెల్లడి
- ఆ దేశ నాయకత్వం కూడా తుడిచిపెట్టుకుపోయిందన్న అమెరికా అధ్యక్షుడు



# రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయింది

- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రాన్ని విడుదల చేయాలి
- సీఎం రేవంత్‌కు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖ
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై బడ్జెట్ సమావేశాల కంటే ముందే పూర్తిస్థాయి శ్వేతపత్రాన్ని విడుదల చేయాలి
- గత 12 ఏళ్లలో తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.12 లక్షల కోట్ల నిధులు కేటాయించింది
- రాష్ట్రంలో జీతాలు, రైతు భరోసా, సంక్షేమ పథకాల అమలు.. ఇలా ఏ పని చేయాలన్నా అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది




ఢిల్లీ

తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రాన్ని విడుదల చేయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి లేఖ రాశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై బడ్జెట్ సమావేశాల కంటే ముందే పూర్తిస్థాయి శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత 12 ఏళ్లలో తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.12 లక్షల కోట్ల నిధులు కేటాయించిందని వెల్లడించిన కిషన్‌రెడ్డి.. రాష్ట్రంలో జీతాలు, రైతు భరోసా, సంక్షేమ పథకాల అమలు.. ఇలా ఏ పని చేయాలన్నా అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని విమర్శలు గుప్పించారు. సాస్కి పథకం కింద తెలంగాణకు రూ.10,000 కోట్లకు పైగా వడ్డీ లేని రుణాలను కేంద్రం అందించిందని కిషన్‌రెడ్డి వివరించారు. ఎన్నికల వేళ ఇచ్చిన 420 హామీలను అమలు చేయకుండా, ఖజానా ఖాళీ అని నెపం నెట్టడంపై కేంద్రమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని లేఖలో ఆయన స్పష్టీకరించారు. “2023లో రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టో ద్వారా 6 ప్రధాన గ్యారంటీలతో పాటుగా 420 - మిగతా3లో

# రాజ్యసభ రేసులో 12 మంది

- ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాల కోసం తీవ్ర పోటీ
- రెడ్డి సామాజికవర్గం నుంచి సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు, రాజకీయ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డిలు పోటీ
- బీసీ సామాజిక వర్గం నుంచి పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు, ఈరవత్రి అనిల్ కుమార్, మహిళా కోటాలో ఇటీవలే ఉమెన్ కమిషన్ ఛైర్మన్‌గా పదవీకాలం పూర్తి చేసుకున్న నేరెళ్ల శారదలు
- ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల నుంచి బెల్లయ్య నాయక్, దొమ్మాటి సాంబయ్య, మైనారిటీ నుండి అజ్మతుల్లా హుస్సేన్ ఉన్నారు.



హైదరాబాద్

తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాల కోసం తీవ్ర పోటీనే నడుస్తోంది. దాదాపు డజను మంది నేతలు రేసులో ఉన్నారు. రెడ్డి సామాజికవర్గం నుంచి సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు, రాజకీయ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డిలు పోటీ పడుతున్నారు. బీసీ సామాజిక వర్గం నుంచి పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు, ఈరవత్రి అనిల్ కుమార్, మహిళా కోటాలో ఇటీవలే ఉమెన్ కమిషన్ ఛైర్మన్‌గా పదవీకాలం పూర్తి చేసుకున్న నేరెళ్ల శారదలు ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల నుంచి బెల్లయ్య నాయక్, దొమ్మాటి సాంబయ్య, మైనారిటీ నుండి అజ్మతుల్లా హుస్సేన్ ఉన్నారు. కమ్మ సామాజికవర్గం నుంచి కుసుమకుమార్ ఢిల్లీ స్థాయిలో పైరవీ చేస్తున్నారు. ఖాళీ అవుతున్న రెండు సీట్లలో ఒకటి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, సుప్రీంకోర్టు అడ్వకేట్ అభిషేక్ మను సింఘ్వీకి - మిగతా3లో

## చర్చలు, దౌత్యానికే భారత్ మద్దతు

- 48 గంటల్లో 8 పశ్చిమాసియా దేశాధినేతలతో మాట్లాడిన మోదీ
- ఒమన్, కువైట్‌లో జరుగుతున్న దాడులపై ఆందోళన వ్యక్తం చేసిన మోదీ
- ఒమన్ సుల్తాన్, కువైట్ రాజుతో మాట్లాడిన మోదీ
- ఒమన్, కువైట్‌లో ఉన్న భారతీయుల భద్రత గురించి ఆరా తీసిన మోదీ



# చర్చలు, దౌత్యానికే భారత్ మద్దతు



ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో గల్ఫ్ దేశాలపై దాడులు జరగడంపై ప్రధాని నరేంద్రమోదీ ఆందోళన వ్యక్తం చేశారు. గత 48 గంటల్లో ప్రధానమంత్రి 8 పశ్చిమాసియా దేశాల అధినేతలతో మాట్లాడారు. యూఏఈ, ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, జోర్డాన్, బహ్రెయిన్, ఒమన్, కువైట్, ఖతార్ నాయకులతో మాట్లాడారు. అటు కేంద్ర విదేశాంగ శాఖ కూడా ఆందోళ వ్యక్తం చేసింది. మరోవైపు పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితులను పర్యవేక్షించేందుకు ఓ బృందాన్ని కూడా ఏర్పాటు చేసింది.

మంగళవారం మధ్యాహ్నం ఒమన్ సుల్తాన్ హైతామ్ బిన్ తారిక్, కువైట్ యువరాజు షేక్ సబాహ్ అల్ ఖలేద్, ఖతార్ అమీర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీతో ప్రధాని ఫోన్‌లో మాట్లాడారు. ఒమన్, కువైట్? దేశాల్లో నివసిస్తున్న భారతీయుల సంక్షేమం, భద్రతా అంశాలపై ప్రధాని మోదీ చర్చించారు. గత రెండు రోజుల్లో మొత్తం 8 దేశాధినేతలతో చర్చలు జరిపారు. ఆయా దేశాల సార్వభౌమత్వం, భౌగోళిక సమగ్రతను ఉల్లంఘిస్తూ జరిగిన దాడులను ఖండించారు. ఈ క్లిష్ట సమయంలో భారత్ వారి ప్రజలతో ఐక్యతగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

**ఆందోళన వ్యక్తం చేసిన విదేశాంగ శాఖ**

అటు పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై విదేశాంగ శాఖ కూడా తీవ్ర ఆందోళ వ్యక్తం చేసింది. పవిత్ర రంజాన్ మాసంలో గల్ఫ్ ప్రాంతంలో పరిస్థితి దిగజారడంపై ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రకటనను విడుదల చేసింది. ఘర్షణ మరింత తీవ్రరూపం దాల్చడంతో పాటు ఇతర దేశాలకు కూడా విస్తరించిందని తెలిపారు. విధ్వంసం, ప్రాణనష్టం పెరుగుతుండగా సాధారణ జీవనం, ఆర్థిక కార్యకలాపాలు స్తంభించాయని పేర్కొంది. అన్ని పక్షాలు సంయమనం పాటించాలని, ఉద్రిక్తతలు పెరగకుండా నివారించాలని, పౌరుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని భారత్? కోరినట్లు తెలిపింది. గల్ఫ్ ప్రాంత భద్రత, స్థిరత్వంలో కీలక వాటా కలిగిన సమీప పొరుగు దేశంగా ఈ పరిణామాలు తమకు ఆందోళన కలిగిస్తున్నాటని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. గల్ఫ్ ప్రాంతంలో దాదాపు కోటిమంది భారతీయులు ఉన్నారనీ వారి భద్రత, శ్రేయస్సుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడించింది. భారతదేశ వాణిజ్యం, ఇంధన సరఫరా గొలుసులు ఈ ప్రాంతంపై ఆధారపడి ఉన్నాయన్న విదేశాంగశాఖ ఇక్కడి అంతరాయాలు దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాలను చూపుతాయని తెలిపింది. వాణిజ్య ఓడలపై దాడులను ఖండిస్తున్నామని, ఇప్పటికే పలువురు భారతీయులు మృతిచెందారని వివరించింది. గత కొన్ని రోజుల్లో జరిగిన దాడుల్లో కొందరు భారతీయులు ప్రాణాలు కోల్పోయారని, మరికొందరు కనిపించకుండా పోయారని విచారం వ్యక్తం చేసింది.

ప్రస్తుత పరిస్థితుల్లో తక్షణమే చర్చలు,దౌత్యానికి తిరిగి రావాలని భారత్ బలంగా పునరుద్ఘాటించింది. ఘర్షణకు త్వరితగతిన ముగింపు పలకాలని కోరింది. ఇప్పటికే అనేక ప్రాణాలు కోల్పోయినందుకు సంతాపం వ్యక్తం చేసింది. ప్రభావిత దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు, కాన్సులేట్లు అక్కడి భారతీయులతో, సంఘాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాయని తెలిపింది. అవసరమైన సూచనలు, హెచ్చరికలు జారీ చేస్తున్నాయని, ఘర్షణ కారణంగా చిక్కుకుపోయిన వారికి సాధ్యమైన సహాయం అందిస్తున్నాయని పేర్కొంది. రాబోయే రోజుల్లో కూడా కాన్సులర్ సేవలను చురుకుగా కొనసాగిస్తామని స్పష్టం చేసింది.

**ప్రాంతీయ ప్రభుత్వాలతో సంప్రదింపులు**

ఈ ప్రాంత ప్రభుత్వాలతో పాటు ఇతర కీలక భాగస్వామ్య దేశాలతో భారత్ సంప్రదింపులు కొనసాగిస్తోందని తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి తమ సమకాలీనులతో చర్చలు జరిపారని వెల్లడించింది. పరిస్థితులను నిశితంగా గమనిస్తూ జాతీయ ప్రయోజనాల దృష్ట్యా తగిన నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొంది.

పశ్చిమాసియా పరిణామాలపై మంత్రిత్వ బృందం ఏర్పాటు

మరోవైపు పశ్చిమాసియాలో వేగంగా మారుతున్న పరిణామాలను నిశితంగా గమనించేందుకు అంతర మంత్రిత్వ బృందాన్ని (ఇంటర్ మినిస్ట్రీయల్ గ్రూపు) కేంద్రం ఏర్పాటు చేసింది. ఈ బృందం ప్రతిరోజూ సమావేశమై పరిస్థితులను సమీక్షిస్తోందని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్ మంగళవారం వెల్లడించారు.

# మౌనమే భారత ప్రతిష్ఠను తగ్గిస్తోంది



ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించి లోక్?సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా సయ్యద్ అలీ ఖమేనీ హత్యపై కేంద్రం స్పందించాలని అన్నారు. ఈ విషయంలో మోదీ సర్కార్ మౌనం పాటించడం వల్ల ప్రపంచ వేదికపై భారత్?కు ఉన్న గౌరవం తగ్గిపోతుందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు రాహుల్ గాంధీ ఎక్స్?లో పోస్ట్ చేశారు. 'ఈ ఘర్షణపై భారత్? నైతికంగా, స్పష్టంగా వ్యవహరించాలి. అంతర్జాతీయ చట్టాల పరిరక్షణ, మానవ ప్రాణాల రక్షణ కోసం స్పష్టంగా మాట్లాడే ధైర్యం మనకు ఉండాలి. మన విదేశాంగ విధానం సార్వభౌమత్వం, వివాదాలు శాంతియుత పరిష్కారంపై ఆధారపడి ఉంది. ఎప్పటికీ అదే విధంగా కొనసాగాలి. ప్రపంచ వ్యవస్థను నిర్వచించే మార్గంగా ఒక దేశాధినేత హత్యకు ప్రధానమంత్రి మద్దతు ఇస్తారా? ప్రధాని మోదీ ఈ విషయంలో మాట్లాడాలి. ఇప్పుడైనా మౌనం వీడాలి. ఈ మౌనం ప్రపంచంలో భారత ప్రతిష్ఠను తగ్గిస్తోంది' అని రాహుల్ గాంధీ అన్నారు.

**పశ్చిమాసియా ఉద్రిక్తతలపై రాహుల్ ఆందోళన**

అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య పెరుగుతున్న ఘర్షణలపై రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సున్నితమైన ప్రాంతాన్ని పెద్ద యుద్ధానికి దారి తీసే పరిస్థితి వైపు నెట్టివేస్తున్నాయని అన్నారు. భారతీయులతో సహా కోట్లాది మంది ప్రజలు ఈ అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. భద్రతాపరమైన ఆందోళనలు వాస్తవమే అయినప్పటికీ, సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించే దాడులు సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తాయని పేర్కొన్నారు. ఇరాన్?, ఇతర పశ్చిమాసియా దేశాలపై చేస్తున్న దాడులను ఖండించాల్సిందే అని చెప్పారు. ఇది మరింత హింసకు దారి తీస్తుందని తెలిపారు. సంభాషణ, సహనం మాత్రమే శాంతికి మార్గమని రాహుల్ గాంధీ అన్నారు.

**ప్రధాని మోదీ మౌనం వీడాలంటూ సోనియా వ్యాఖ్య**

ఖమేనీ లక్ష్యంగా చేసిన హత్యపై నరేంద్ర మోదీ ప్రభుత్వం మౌనం వహిస్తుందంటూ కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ కూడా స్పందించారు. మౌనంగా ఉండటం అనేది తటస్థ వైఖరి కాదని, పరాజయమని అన్నారు. అమెరికా–ఇజ్రాయెల్ చేపట్టిన భారీ దాడిని ప్రధాని మోదీ విస్మరించారని ఆరోపించారు. కేవలం యూఏఈపై ఇరాన్ ప్రతీకార దాడిని ఖండించడానికి మాత్రమే పరిమితమయ్యారని పేర్కొన్నారు.

ఈ విషయంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రభుత్వానికి నిస్సంపదేహంగా మద్దతు ప్రకటించారని అన్నారు. హత్యకు కేవలం 48 గంటల ముందు ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటన నుంచి తిరిగి వచ్చారని తెలిపారు. నాలుగో రోజు కూడా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్–అమెరికా, ఇరాన్? మధ్య యుద్ధం కొనసాగుతోంది. ఇరాన్ అధికారిక మీడియా భవనం సహా క్షిపణులు, రాడార్ వ్యవస్థలే లక్ష్యంగా ఇజ్రాయెల్ వైమానికదాడులు చేశాయి. ఇక ఇరాన్?లో ఇప్పటి వరకు 787మంది మృతి చెందారు. ఇరాన్? కూడా ప్రతీకార దాడులు చేస్తూనే ఉంది. అమెరికా సైనిక స్థావరాలపై లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తోంది. ఇదిలా ఉండగా హార్ముజ్? జలసంధిని మూసివేసినట్లు ప్రటించింది. మరోవైపు లెబనాన్ రాజధాని బీరుట్‌పై కూడా ఇజ్రాయెల్ వైమానిక దాడులను ఉద్ధృతం చేసింది. తాజాగా భూతలదాడులు చేపట్టింది. హెజ్బొల్లా కమాండ్ సెంటర్‌తో సహా ఆయుధ నిల్వ కేంద్రాన్ని ధ్వంసం చేసింది. ఇజ్రాయెల్ వైమానిక స్థావరం దిశగా డ్రోన్లు ప్రయోగించినట్లు హెజ్బొల్లా తెలిపింది. ఇజ్రాయెల్ దురాక్రమణకు వ్యతిరేకంగా దాడులు కొనసాగుతాయని ప్రకటించింది. దాడులు ఆపకుంటే ప్రతీకారచర్యలు తీవ్రంగా ఉంటాయని హెజ్బొల్లా హెచ్చరించింది. ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటివరకు 52మంది మృతి చెందినట్లు లెబనాన్ ఆరోగ్య శాఖ తెలిపింది. మరో 154 మంది గాయపడ్డారని వెల్లడించింది.

# 60 ఏళ్ల భక్తుడు- ఏడాదిలో 11,000 కి.మీ నడక



మనం ఏడాదిలో మహా అయితే ఓ 10 లేదా 20 సార్లు గుడికెళ్తాం. వేరే జిల్లా, రాష్ట్రంలోని తీర్థయాత్రలకైతే ఇంకా తక్కువ సార్లే వెళ్తాం. అయితే మధ్యప్రదేశ్‌కు చెందిన 60 ఏళ్ల భక్తుడు ఏడాది వ్యవధిలో 400 గుడులను సందర్శించాడు. అందుకోసం 11,000 కి.మీలు నడిచాడు. అంతలా దైవ భక్తిని చూపించిన వ్యక్తి గురించి ఈ స్టోరీలో తెలుసుకుందాం.

**ఆరు పదుల వయసులో చలాకీగా**

సుందర్‌లాల్ స్వస్థలం విదిష జిల్లాలోని ఖేర్వా హాత్ గ్రామం. ఆయన దైవ భక్తుడు. ఏడాది వ్యవధిలో ఆయన అయోధ్య రామమందిరం, కాశీ సహా 400 గుడులను సందర్శించాడు. ఈ మతపరమైన తీర్థయాత్రలకు కాలినడకనే వెళ్తున్నాడు. 60 ఏళ్ల వయసులో కాళ్లు, మోకాలు నొప్పులతో చాలా మంది ఇంట్లో కూర్చొంటున్న సమయంలో సుందర్‌లాల్ మాత్రం అందుకు భిన్నం. ఆరు పదులు ఏజ్‌లోనూ యువకుడిలా నడుస్తూ దైవ దర్శనాలు చేసుకుంటున్నాడు.

**ఏ సీజన్ అయినా డోంట్ కేర్!**

వయసు పైబడినా పర్వతారోహణలు, ఎండ, చలితో సహా వివిధ వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటూ సుందర్‌లాల్ తన మతపరమైన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాడు. ఉత్తర హిమాలయ ప్రాంతాల కఠినమైన చలి అయినా, దక్షిణ భారతదేశంలోని మండే ఎండలైనా అతని ప్రయాణ వేగం ఎప్పుడూ తగ్గలేదు. అంతటి వయసులోనూ 11,000 కిలోమీటర్లు కాలినడకన ప్రయాణం సుందర్‌లాల్ అజేయమైన సంకల్ప శక్తికి, దేవునిపై ఉన్న అచంచల విశ్వాసానికి నిదర్శనమని చెప్పొచ్చు. సుందర్‌లాల్ భక్తి ప్రయాణం ప్రాథమిక లక్ష్యం దేవాలయాలను సందర్శించడమే కాదు. దేశ ఐక్యత, సాంస్కృతిక వారసత్వాన్ని దగ్గర నుంచి పరిశీలించడం కూడా.

**అక్కడే బస**

అయితే ఇన్ని వేల కిలోమీటర్ల మతపరమైన పాదయాత్రలో సుందర్‌లాల్ ఒక్క రూపాయి కూడా ఎప్పుడూ ఖర్చు చేయలేదు. నడుస్తున్నప్పుడు దారి మధ్యలో భక్తులు, గ్రామస్థులు అందించే అహారాన్ని తింటాడు. అలాగే దేవాలయాలు, ధర్మశాలలు, సత్రాల్లో రాత్రివేళల్లో బస చేస్తాడు. సుందర్‌లాల్ ప్రతి రోజు ఉదయం 3-4 గంటలకు నడకను ప్రారంభిస్తాడు.

**'ఈ సుదీర్ఘ ప్రయాణాన్ని ఎప్పుడూ ఊహించలేదు'**

ఏడాది క్రితం తన మతపరమైన ప్రయాణం ప్రారంభమైందని సుందర్‌లాల్ తెలిపాడు. దేవుడిని ఆరాధించాలనే బలమైన కోరిక తనను ఇంటి నుంచి బయలుదేరడానికి ప్రేరేపించిందని వెల్లడించాడు. తాను ఇంత సుదీర్ఘ ప్రయాణం చేస్తానని ఎప్పుడూ ఊహించలేదన్నాడు. కానీ దేవుని దయ వల్ల అన్నీ సాధ్యమేనని అభిప్రాయపడ్డాడు. తనకు భార్య, కొడుకు, కూతురు ఉన్నారని, వారి నుంచి తాను ఈ ప్రయాణం కోసం ఆర్థిక సహాయం తీసుకోలేదని స్పష్టం చేశాడు. ఈ ప్రయాణాన్ని పూర్తిగా దేవుడి మీద బారం వేసి కొనసాగిస్తున్నానని అన్నాడు.

**అయోధ్యలో ఎక్కువ రోజులు ఉన్నాను : సుందర్‌లాల్**

"మధ్యప్రదేశ్‌లోని స్థానిక దేవాలయాల సందర్శనతో నా ప్రయాణం ప్రారంభం అయ్యింది. ఆ తర్వాత ఉత్తర భారతదేశం వైపునకు ప్రయాణం సాగించాను. అయోధ్యలోని రామాలయాన్ని సందర్శించడం నాకు కొత్త శక్తి లభించినట్లైంది. కాశీ విశ్వనాథుడిని దర్శించుకున్నాను. అక్కడ గంగానదిలో స్నానం చేశాను. చాలా రోజులపాటు అయోధ్యలోనే ఉన్నాను. అక్కడ స్థానిక భక్తులు నాకు ఆహారం పెట్టారు" అని సుందర్‌లాల్ తెలిపాడు.

**'దేవుడి దయతో ఆరోగ్యం, శక్తి లభించింది'**

సుందర్‌లాల్ ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్‌లోని మధుర నుంచి రాజస్థాన్‌లోని ప్రసిద్ధ ఖాతు శ్యామ్ ఆలయం వైపునకు నడుస్తున్నాడు. "ఖాతు శ్యామ్‌జీని సందర్శించిన తర్వాత ఓంకారేశ్వర్ ఆలయాన్ని దర్శించుకుంటాను. నాకు ఎటువంటి ప్రణాళికలు లేవు. దేవుడు తీసుకెళ్లినంత దూరం నడుస్తూనే ఉంటాను. రోజుకు 30 కిలోమీటర్లు నడుస్తున్నాను. ఇంత వయసులో ఈ ప్రయాణం సవాల్‌తో కూడుకున్నదే. దేవుడి దయ నన్ను ఆరోగ్యంగా, శక్తివంతంగా ఉంచింది" అని సుందర్‌లాల్ వెల్లడించాడు.

## ఇరాన్ సంక్షోభం...

ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ముఖ్యంగా ఇరాన్ యుద్ధం కారణంగా పశ్చిమ ఆసియాలో నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో, భారతదేశ ఇంధన భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ఈ ఆందోళనలకు చెక్ పెడుతూ భారత ప్రభుత్వ వర్గాలు కీలక విషయాలను వెల్లడించాయి. ముడిచమురు, ఎల్పీజీ, ఎల్ఎన్జీ నిల్వల విషయంలో భారత్ ప్రస్తుతం అత్యంత సురక్షితమైన, సౌకర్యవంతమైన స్థితిలో ఉందని స్పష్టం చేశాయి. ప్రస్తుతం దేశంలో సుమారు 25 రోజులకు సరిపడా ముడిచమురు మరియు పెట్రోలియం ఉత్పత్తుల నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో దేశంలోని రిజర్వ్ ట్యాంకుల్లో ఉన్న నిల్వలతో పాటు, ప్రస్తుతం సముద్ర మార్గంలో భారత నౌకాశ్రయాలకు వస్తున్న ఇంధన నౌకల్లోని సరుకు కూడా కలిపి లెక్కించినట్లు అధికారులు తెలిపారు. సాధారణంగా భారత్ తన ఇంధన అవసరాల్లో 85 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతుంది. ఇందులో సుమారు 50 శాతం చమురు పశ్చిమ ఆసియా దేశాల నుంచే వస్తుంది. ఇరాన్ యుద్ధం కారణంగా ఈ ప్రాంతంలోని కీలకమైన 'హార్ముజ్ జలసంధి' గుండా జరిగే రవాణాకు ఆటంకం ఏర్పడింది. అయితే, గత కొన్నేళ్లుగా భారత్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ తన చమురు దిగుమతులను వైవిధ్యభరితం చేసింది. కేవలం గల్ఫ్ దేశాలపైనే ఆధారపడకుండా ఆఫ్రికా, రష్యా మరియు అమెరికా దేశాల నుంచి దిగుమతులను గణనీయంగా పెంచుకుంది. దీనివల్ల హార్ముజ్ జలసంధిలో అవాంతరాలు ఏర్పడినా, భారత్‌కు వచ్చే సరఫరాలో పెద్దగా కోత పడలేదని ఓ సీనియర్ అధికారి వివరించారు. ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం వంటి ప్రభుత్వ రంగ సంస్థల వద్ద రాబోయే కొన్ని వారాలకు సరిపడా స్టాక్ ఉందని, వివిధ మార్గాల ద్వారా సరఫరా కొనసాగుతోందని తెలిపారు. మరోవైపు, దేశీయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని, బఫర్ స్టాక్‌ను మరింత పెంచేందుకు చమురు కంపెనీలకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో పెట్రోలియం ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేయవద్దని సూచించింది.

**వ్యూహాత్మక నిల్వలు – సామర్థ్యం:**

అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి భారత్ వ్యూహాత్మక చమురు నిల్వలను ఏర్పాటు చేసుకుంది. పాడూరులో 2.25 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యం, విశాఖపట్నంలో 1.33 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యం, మంగళూరులో 1.5 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన స్టోరేజ్ సౌకర్యాలు ఉన్నాయి. అదనంగా, ఒడిశాలోని చండిఖోల్ తీర ప్రాంతంలో మరో భారీ నిల్వ కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ధరలు ఆకాశాన్ని తాకినప్పుడు లేదా సరఫరా నిలిచిపోయినప్పుడు ఈ నిల్వలను వినియోగించుకోవడం ద్వారా దేశీయ మార్కెట్‌ను కాపాడుకోవచ్చు.

**ధరల ప్రభావం:**

సరఫరా పరంగా భారత్ సురక్షితంగా ఉన్నప్పటికీ, ధరల పెరుగుదల మాత్రం ఆందోళన కలిగిస్తోంది. ఇరాన్ సంక్షోభం తర్వాత బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 80 డాలర్లు దాటింది. ఇది సుమారు 10 శాతం పెరుగుదల. చమురు ధరల పెరుగుదల వల్ల భారత్ దిగుమతి బిల్లు తడిసి మోపెడవడమే కాకుండా, దేశంలో ద్రవ్యోల్బణం పెరిగి ఆర్థిక వృద్ధిని దెబ్బతీసే ప్రమాదం ఉంది. గణాంకాల ప్రకారం, 2025 మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో భారత్ చమురు దిగుమతుల కోసం ఏకంగా 137 బిలియన్ డాలర్లు వెచ్చించింది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2025 ఏప్రిల్ నుంచి 2026 జనవరి వరకు 206.3 మిలియన్ టన్నుల ముడిచమురు దిగుమతికి 100.4 బిలియన్ డాలర్లు ఖర్చు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

## ఇరాన్ తాజాగా చర్చలకు ప్రయత్నించింది



యుద్ధం మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ తాజాగా తమతో చర్చలు జరిపేందుకు సిద్ధమైందని, కానీ అందుకు సమయం మించిపోయిందని ట్రంప్ స్పష్టం చేశారు. ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య భీకర దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ట్రంప్ తన సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ఈ విషయంపై స్పందించారు. "ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ (వాయు రక్షణ వ్యవస్థ), ఎయిర్ ఫోర్స్ (వాయుసేన), నేవీ (నావికాదళం) తుడిచిపెట్టుకుపోయాయి. ఇరాన్ నాయకత్వాన్ని తుదముట్టించాం. ఇప్పుడు వారు మాతో మాట్లాడాలని కోరుకుంటున్నారు. తాజాగా ఇరాన్ చర్చలు జరిపేందుకు ప్రయత్నించింది. దానికి నేను 'టూ లేట్' (ఇప్పటికే చాలా ఆలస్యమైంది) అని సమాధానమిచ్చాను" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. వాషింగ్టన్ పోస్ట్‌లో 'ట్రంప్ డాక్ట్రిన్' పేరుతో వచ్చిన ఒక విశ్లేషణాత్మక కథనానికి స్పందనగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం తీవ్ర స్థాయికి చేరుకోగా, అమెరికా సైనిక చర్యలు కొనసాగుతున్నాయి. ఇరాన్ సైనిక శక్తి, నాయకత్వం తీవ్రంగా నష్టపోయాయని, యుద్ధం మరికొన్ని వారాల పాటు కొనసాగే అవకాశం ఉందని ట్రంప్ అంచనా వేశారు. అమెరికా సైనిక శక్తి తిరుగులేనిదని ఆయన ఎం ?నరుద్ఘాటించారు.

## సర్కార్ ఇచ్చిన సొమ్ము- 'గుడి' నిర్మాణం కోసం ఇచ్చేసిన మహిళలు

ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయడానికి ఆ గ్రామ మహిళలంతా ఒకే తాటిపైకి వచ్చారు. ప్రభుత్వం 'గృహలక్ష్మి పథకం' కింద తమ ఖాతాల్లో జమ చేస్తున్న నగదులో కొంత ఊరి దేవత గుడి కోసం విరాళంగా ఇచ్చి తమ భక్తిని చాటుకున్నారు. ఓ వైపు గ్యారెంటీ పథకాల వల్ల రాష్ట్ర ఖజానాపై భారం పడుతోందని విమర్శలు వస్తున్న తరుణంలో, గృహలక్ష్మి స్కీమ్? ద్వారా వచ్చిన డబ్బుతో ఆలయ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు కర్ణాటకకు చెందిన మహిళలు. ఇంతకీ వీరు ఈ నిర్ణయం తీసుకోవడం వెనుకున్న కథేంటో ఇప్పుడు చూద్దాం.

విరాళంగా గృహలక్ష్మి స్కీమ్? డబ్బులు

కర్ణాటక, గదగ్ తాలూకాలోని తిమ్మాపుర గ్రామంలో నాలుగు సంవత్సరాల క్రితం రేణుక ఎల్లమ్మ తల్లి రాతి ఆలయాన్ని నిర్మించాలని అక్కడి గ్రామస్థులు నిశ్చయించుకున్నారు. ఈ క్రమంలో గ్రామస్థులంతా కలిసి సమష్టిగా ఓ ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. ఆలయ నిర్మాణానికి మొత్తంగా సుమారు కోటి రూపాయల ఖర్చు అవుతుందని అంచనా వేసుకున్నారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ నుంచి నైపుణ్యం కలిగిన శిల్పులను పిలిపించి నిర్మాణ పనులు అప్పగించారు. అయితే, ప్రారంభ దశలో గ్రామస్థులే దాదాపు 50 లక్షల రూపాయల విరాళాలు సేకరించారు. వీటితో ఆలయ పునాదులు, గోడ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అనంతరం, ఆర్థిక ఇబ్బందులు, అదనపు ఖర్చుల కారణంగా ఆలయ నిర్మాణ పనులు కొంతకాలం ఆగిపోయాయి. పనులు పూర్తి కావడానికి ఇంకా రూ.50 లక్షల కావాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఆలయ కమిటీ, గ్రామస్థులు ప్రత్యామ్నాయ నిధుల కోసం అన్వేషించారు. ఈ నేపథ్యంలో గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ద్వారా స్వచ్ఛంద విరాళాలు సేకరించాలని అభిప్రాయపడ్డారు. గృహలక్ష్మి పథకం ద్వారా వచ్చిన డబ్బును స్వచ్ఛందంగా విరాళాల రూపంలో ఇవ్వాలని మహిళలను అభ్యర్థించారు ఆ గ్రామస్థులు. దానికి వారు కూడా ఒప్పుకున్నారు. అనంతరం ఆలయ నిర్మాణం కోసం గ్రామంలోని మహిళలు తమ డబ్బులను విరాళంగా ఇవ్వడం ప్రారంభించారు.తిమ్మాపూర్ గ్రామంలో దాదాపు 850 మంది గృహలక్ష్మి లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో దాదాపు 100 మంది మహిళలు ఇప్పటికే విరాళాలు అందించారు. మొత్తంగా రూ.2.5 లక్షలు సేకరించడం జరిగింది.

# అప్పుల ఊబిలో రాష్ట్రం కూరుకుపోయింది

-మొదటిపేజీ తరువాయి

హామీలను తెలంగాణ ప్రజలకు ఇచ్చింది. ఈ హామీలను నమ్మిన తెలంగాణ ప్రజానీకం కాంగ్రెస్‌కి అధికారాన్ని కట్టబెట్టింది. అనంతరం ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన మీరు, ఇచ్చిన హామీలను అమలు చేయమంటే రాష్ట్ర ఖజానాలో లంకెబిందెలకు బదులు ఖాళీ మట్టి కుండలు ఉన్నాయంటూ వ్యంగ్యంగా మాట్లాడుతూ ఇచ్చిన హామీల అమలునుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ..రాష్ట్ర ఖజానా గురించి ఇలా మాట్లాడిన మీరే, ఇటీవల ఒక సభలో మాట్లాడుతూ సోనియా గాంధీ-రాహుల్ గాంధీ కుటుంబానికి, కాంగ్రెస్ పార్టీకి అవసరమైతే రూ. 1,000 కోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. మీరు మాట్లాడిన తీరును చూస్తుంటే, రాష్ట్ర ఖజానా నిల్ - కాంగ్రెస్ నాయకుల జేబులు ఫుల్ అన్న విషయం అర్థమవుతోంది.

..2014 లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ గారి నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారం చేపట్టిననాటి నుంచి నేటి వరకు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అనేక రకాలుగా సహాయ, సహకారాలను అందిస్తూ వస్తోంది. వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలు, మరెన్నో మూలధన పెట్టుబడులు మొదలైనవాటి రూపంలో గత 12 సంవత్సరాల కాలంలో దాదాపు రూ. 12 లక్షల కోట్ల నిధులను తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి మరియు ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించింది.

..అందులో రూ.2.5 లక్షల కోట్ల పన్నుల వాటా నిధులు, రూ.1.85 లక్షల కోట్ల విలువైన రహదారుల నిర్మాణం, దాదాపు రూ.36,000 కోట్లకు పైగా రైల్వే బడ్జెట్ కేటాయింపులు, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మరో రూ. 50,000 కోట్ల విలువైన రైల్వే పనులు, దాదాపు రూ.40,000 కోట్ల ఉపాధి హామీ నిధులు, రూ.50,000 కోట్ల ఉచిత రేషన్ బియ్యం పంపిణీ, గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు వివిధ ఆర్థిక సంఘాల సిఫారసుల ద్వారా అందిస్తున్న రూ.40,000 కోట్లకు పైగా నిధులు, రూ.12,000 కోట్లకు పైగా విలువైన విద్యుత్ ప్రాజెక్టులు, రూ.14,000 కోట్లకు పైగా పీఎం కిసాన్ నిధులు, ఎరువుల సబ్సిడీ కోసం రూ.80,000 కోట్లకు పైగా నిధులు, విద్య ౖ క్రీడలకు రూ.21,000 కోట్లకు పైగా నిధులు, దాదాపు రూ.9,000 కోట్ల ఆరోగ్య సంరక్షణ నిధులు మొదలైనవి ఉన్నాయి.

..అంతే కాకుండా, కేంద్ర ప్రభుత్వం గత 12 సంవత్సరాల కాలంలో దాదాపు రూ.2 లక్షల కోట్ల కనీస మద్దతు ధరను చెల్లించి, తెలంగాణ రైతుల నుంచి వరి ధాన్యాన్ని సేకరించింది. మరో రూ.60,000 కోట్ల కనీస మద్దతు ధరను చెల్లించి, తెలంగాణ రైతుల నుంచి పత్తిని సేకరించింది. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులను ఇవ్వడమే కాకుండా, వివిధ కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సంస్థల ద్వారా దాదాపు రూ. 10 లక్షల కోట్ల ఋణాలను కూడా తెలంగాణ రాష్ట్రానికి అందించింది.

వీటికి అదనంగా రాష్ట్రాలలో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన మూలధన పెట్టుబడి నిధుల కోసం రాష్ట్రాలకు 50 సంవత్సరాల కాలపరిమితితో కూడిన వడ్డీ రహిత ఋణాలను అందించి ఆయా రాష్ట్రాల అభివృద్ధికి అదనపు సహకారాన్ని అందించాలనే ప్రధానమంత్రి మోదీ గారి సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం "స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్ మెంట్(ాూాజ×)" పేరిట ఒక నూతన పథకాన్ని 2020-21 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించింది.

..కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అందించిన ఈ సౌలభ్యాన్ని సానుకూలంగా అందిపుచ్చుకున్న రాష్ట్రాలు 2020-21 నుండి నేటి వరకూ మూలధన పెట్టుబడితో కూడిన అనేక ప్రాజెక్టులకు అవసరమైన నిధులను ఈ ఋణాల ద్వారా సమకూర్చుకున్నాయి. ఇందులో తెలంగాణ రాష్ట్రానికి కూడా పెద్ద ఎత్తున లబ్ధి చేకూరింది. ాూాజ× పథకం కింద 2020-21 నుంచి 2025-26 వరకు తెలంగాణ రాష్ట్రానికి రూ. 10,000 కోట్లకు పైగా వడ్డీ రహిత ఋణాలను అందించడం జరిగింది. ఈ ఋణాలతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మూలధన పెట్టుబడితో కూడిన కొన్ని వందల ప్రాజెక్టులు అమలుకు నోచుకున్నాయి.

..మురుగునీటి నాళాలు, రోడ్ల విస్తరణ, రైల్వే లైన్ల విస్తరణ, బ్రిడ్జిలు, ఫ్లై ఓవర్ల నిర్మాణం, ఆసుపత్రులు, మెడికల్ ౖ నర్సింగ్ కాలేజీలు, సంక్షేమ, మైనారిటీ పాఠశాలలు, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, హాస్టళ్ల నిర్మాణం, పర్యాటక ప్రాంతాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ా== ౖ === మధ్యన రేడియల్ రోడ్ల నిర్మాణం, గోదావరి-మూసీ నది అనుసంధానం, మూసీ నది సుందరీకరణ, స్మార్ట్ సిటీ మిషన్ లో రాష్ట్ర వాటా నిధులు, వరదల వలన పాడైపోయిన నిర్మాణాల పునరుద్ధరణ, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనలో రాష్ట్ర వాటా నిధులు వంటి అనేక ప్రాజెక్టులకు సాస్కి నిధులు ఖర్చు చేశారు.

..ముఖ్యంగా వీమీా ఫేజ్ - ×× కోసం రూ.200 కోట్లు, మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వేలైన్ కోసం రూ. 114 కోట్లు, స్మార్ట్ సిటీస్ పథకం కోసం రూ. 315 కోట్లు, పీఎం గ్రామ సడక్ యోజన కోసం రూ. 674 కోట్లు, ా== ౖ === మధ్యన రేడియల్ రోడ్ల నిర్మాణం కోసం రూ. 200 కోట్లు, సిద్ధిపేట బైపాస్ రోడ్డు కోసం రూ. 110 కోట్లు, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల కోసం రూ. 388 కోట్లు, పలు హాస్టళ్ల నిర్మాణం కోసం రూ. 300 కోట్లు వంటి ప్రాజెక్టులు ఉన్నాయి.

అన్ని రాష్ట్రాలలాగే తెలంగాణ రాష్ట్రం కూడా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలకు కూడా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ రహిత ఋణాల మీద ఆధారపడటం చూస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ఎలాంటి దుస్థితిలో ఉందో తెలుస్తోంది. ఇవి మాత్రమే కాదు, రాష్ట్ర ప్రభుత్వం గతంలో తీసుకున్న ఋణాలకు వడ్డీలు చెల్లించడానికి ఋణాలు, ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి ఋణాలు, రైతు భరోసా నిధులకు ఋణాలు, సంక్షేమ పథకాల అమలుకు ఋణాలు ఇలా చెప్పుకుంటూ పోతే ఋణాలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పని కూడా చేయలేని పరిస్థితి నేడు తెలంగాణలో ఉంది.

..2014 లో మిగులు నిధులతో ఏర్పడిన రాష్ట్రానికి గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో, గత 27 నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణకు పట్టిన దుస్థితికి నేటి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అద్దం పడుతోంది. ప్రతి సంవత్సరం పెద్ద ఎత్తున పెరుగుతున్న రాష్ట్ర తలసరి అప్పు కూడా రాష్ట్ర ఆర్థిక దుస్థితిని తెలియజేస్తోంది.


..ఇలాంటి పరిస్థితులలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి సంబంధించిన వాస్తవాలను తెలంగాణ ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. కాబట్టి, మార్చి 16 నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర బడ్జెట్ సమావేశాలకు ముందుగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి సంబంధించి ఒక పూర్తిస్థాయి శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని తెలంగాణ ప్రజల తరపున మిమ్మల్ని కోరుతున్నాను" అంటూ కిషన్‌రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

# ఫీజుల నియంత్రణకు కసరత్తు..




**హైదరాబాద్ :** ప్రస్తుత కాలంలో పిల్లల స్కూల్ ఫీజులు తల్లిదండ్రులకు మోయలేని భారంగా మారిపోతున్నాయి. నర్సరీ, ఎల్‌కేజీలకే లక్షలకు లక్షలు డొనేషన్లు, ఫీజులు వసూళ్లు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలు రాష్ట్రంలో ఎన్నో ఉన్నాయి. దీంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ప్రైవేట్ స్కూళ్లలో తమ పిల్లలను చదివించేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణపై చర్యలు చేపట్టింది. ఈ మేరకు స్కూళ్ల పరిస్థితి.. అక్కడ అందుబాటులో ఉన్న సౌకర్యాలు, అక్కడ అందున్న విద్యాబోధన తదితర అంశాలను, ఆ పాఠశాలకు సంబంధించి గత రికార్డులను బేరీజు వేసుకొని ఫీజులను నిర్ణయించేందుకు సర్కార్ సిద్ధమైంది.తెలంగాణ వ్యాప్తంగా 11వేల ప్రైవేట్ స్కూళ్లు ఉన్నాయి. మరో నెల రోజుల్లో 2025-26 విద్యా సంవత్సరం ముగియనుంది. వచ్చే విద్యా సంవత్సరంకు సంబంధించి పలు పాఠశాలల్లో అడ్మిషన్లు ప్రారంభంకానున్నాయి. అయితే, కొన్ని పాఠశాలల్లో ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచే ఆనవాయితీకి బ్రేక్ వేస్తూ.. శాస్త్రీయంగా ఫీజులను నిర్ణయించే ప్రక్రియను స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు వేగవంతం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో ప్రస్తుతం వసూలు చేస్తున్న ఫీజులు, గత మూడేళ్ల ఆదాయ, వ్యయాల వివరాలను సేకరించాలని విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు.ప్రతి రెండేళ్లకోసారి 8శాతం మాత్రమే ఫీజు పెంచుకునేలా ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన విధివిధానాలపై కసరత్తు ముమ్మరమైంది. ఎంఈవోలు, డీఈవోల ద్వారా ఏ స్కూళ్లో ఎంత ఫీజు ఉంది..? ఏఏ క్లాసులకు ఎంతెంత తీసుకుంటున్నారు..? అనే వివరాలను ప్రభుత్వం సేకరిస్తోంది. ప్రైవేటు స్కూళ్లలో దేని ఆధారంగా బేస్ ఫీజులను నిర్ణయించాలనేదానిపై అధికారులు కసరత్తు చేశారు.ఆయా స్కూళ్ల నిర్వహణ ఖర్చుల ఆధారంగానే స్కూళ్ల ఫీజులు ఉండాలని విద్యాశాఖ భావిస్తోంది. దీనికోసం గత మూడేళ్ల ఆడిట్ రిపోర్టులు, టీచర్ల జీతాలు, ఇతర నిర్వహణ ఖర్చులను పరిగణలోకి తీసుకోనున్నారు. ఈ లెక్కల ఆధారంగానే ఒక బేస్ ఫీజును నిర్ణయిస్తారు. దానికి తగ్గట్టుగా తర్వాతి రెండేళ్ల ఫీజు డిసైడ్ చేయనున్నారు.విద్యాశాఖపై తాజాగా సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణకు విశ్రాంత న్యాయమూర్తి లేదా ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాట్లు చేస్తామని అన్నారు. నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దు చేయడంతో పాటు సంబంధిత సొమ్మును విద్యా సంస్థల నుంచి తిరిగి రాబట్టేలా చూడాలని నిర్దేశించారు. ఫీజుల నియంత్రణకు సంబంధించిన సిఫార్సులను ప్రజాభిప్రాయం కోసం వెబ్‌సైట్‌లో ఉంచాలని సూచించారు.మరోవైపు.. ఫీజుల నియంత్రణ పక్కాగా అమలు చేసేందుకు స్టేట్ లెవల్ ఫీజుల నియంత్రణ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీకి చైర్మన్‌గా హైకోర్టు రిటైర్డ్ జడ్జిని గానీ, రిటైర్డ్ చీఫ్ సెక్రటరీనిగాని నియమించాలని ప్రభుత్వం డిసైడ్ అయింది. కాగా వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఫీజుల నియంత్రణను చేపట్టాలని ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేపట్టింది.

# కల్వకుంట్ల కుటుంబంలోనూ పెను తుపాను



**హైదరాబాద్ :** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో సుదీర్ఘ కాలం సాగిన ఉత్కంఠకు రౌస్ అవెన్యూ కోర్టు తీర్పుతో తెరపడింది. మాజీ ఎమ్మెల్సీ కవితకు ఈ కేసులో క్లీన్ చిట్ లభించడం బీఆర్ఎస్ శ్రేణులకు పెద్ద ఊరటనిచ్చినప్పటికీ, ఈ తీర్పు అనంతరం చోటుచేసుకున్న పరిణామాలు పార్టీలోనూ, కల్వకుంట్ల కుటుంబంలోనూ పెను తుపానును సృష్టించాయి. ముఖ్యంగా కేటీఆర్ చేసిన ఒక ట్వీట్, దానికి కవిత ఇచ్చిన కౌంటర్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.కోర్టు తీర్పు వెలువడిన వెంటనే కేటీఆర్ స్పందించారు. ఈ కేసు కేవలం రాజకీయ కక్ష సాధింపు అని కొట్టిపారేశారు. అయితే, తన విశ్లేషణలో ఆయన ఒక కీలక వ్యాఖ్య చేశారు. "ఢిల్లీ లిక్కర్ స్కామ్ అనే కల్పిత గాథ వల్ల అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ రాజకీయంగా బలి అయింది అని పేర్కొన్నారు. కవితకు న్యాయం జరిగిందని చెబుతూనే, ఈ కేసు వల్లే పార్టీ ఓడిపోయిందనే అర్థం వచ్చేలా ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి.కేటీఆర్ చేసిన విశ్లేషణపై కవిత తీవ్రంగా మండిపడ్డారు. పార్టీ ఓటమిని తన ఖాతాలో వేయడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. "బీఆర్ఎస్ ఓటమికి నీ అహంకారమే కారణం, నాపై తప్పుడు ప్రచారాలు ఆపాలి" అంటూ ఆమె ఎక్స్ వేదికగా ఘాటుగా స్పందించారు.తాను జైలులో ఉన్న సమయంలో పార్టీ గానీ, అగ్ర నాయకత్వం గానీ కనీసం ఒక ప్రెస్ మీట్ పెట్టి కూడా తనకు అండగా నిలవలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసు తన వ్యక్తిగత లాభం కోసం జరిగింది కాదని, పార్టీ ప్రయోజనాల కోసం పోరాడుతుంటే తనను ఒంటరిని చేశారని ఆమె ఆరోపించారు. నిరుద్యోగం, హామీల అమలులో వైఫల్యం వంటి కారణాల వల్ల పార్టీ ఓడిపోతే, ఇప్పుడు ఆ నెపాన్ని తనపైకి నెట్టడం సరికాదని ఆమె స్పష్టం చేశారు.ఈ వివాదం కేవలం అన్నాచెల్లెళ్ల మధ్య చిన్నపాటి ఘర్షణ మాత్రమే కాదు, దీని వెనుక లోతైన రాజకీయ కోణాలు ఉన్నాయి. కేసు గెలిచిన తర్వాత కవిత తన రాజకీయ ఇమేజ్‌ను తిరిగి పుంజుకోవాలని చూస్తున్నారు. కానీ కేటీఆర్ వ్యాఖ్యలు ఆమెను పార్టీకి నష్టం కలిగించిన వ్యక్తిగా చిత్రించేలా ఉన్నాయని ఆమె భావిస్తున్నారు. కవిత త్వరలో సొంతంగా రాజకీయ అడుగులు వేయబోతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఆమె తనపై ఉన్న లిక్కర్ స్కామ్ ముద్రను కోర్టు ద్వారా చెరిపేసుకున్న తరుణంలో, సొంత అన్నయ్యే దాన్ని పార్టీ ఓటమికి కారణంగా చూపడం ఆమెకు మింగుడుపడటం లేదు.లిక్కర్ స్కామ్ కేసులో న్యాయపరంగా కవిత విజయం సాధించినా, రాజకీయంగా మాత్రం కుటుంబంలో చిచ్చు రేపింది. కేటీఆర్ అహంకారం వల్ల ఓడిపోయామని కవిత, కవిత కేసు వల్లే పార్టీ దెబ్బతిందని కేటీఆర్ పరోక్షంగా వాదించుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మరి ఢిల్లీ లిక్కర్ స్కాంలో క్లీన్ చిట్ వచ్చిన తర్వాత కూడా అన్నాచెల్లెళ్లు ఇలా బహిరంగంగా విమర్శించుకోవడం ఆసక్తి రేపుతోంది.

## రాజ్యసభ రేసులో 12 మంది

-మొదటిపేజీ తరువాయి

ఇవ్వాలని హైకమాండ్ ఎప్పుడో డిసైడ్ అయిందంటున్నారు. ఇప్పటికే తెలంగాణ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయనను కంటిన్యూ చేయడం ఖాయమైపోయింది. ఇక రెండో సీటు కోసం పోటీ మామూలుగా లేదు. అయితే ఈ సీటు కూడా ఇప్పటికే పార్టీ అధిష్టానం డిసైడ్ చేసిందనే చర్చ పార్టీలో జోరుగా వినిపిస్తోంది.రెండో రాజ్యసభ సీటుకు పార్టీ అధిష్టానం వంశీచంద్ రెడ్డి పేరును ప్రతిపాదిస్తోందట. వంశీచంద్ గత పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. పార్టీ పాలసీ ప్రకారం ఎన్నికల్లో పోటీ చేసిన వారికి మళ్లీ పదవులు ఇవ్వొద్దని..టికెట్ త్యాగం చేసిన వారికే ప్రయారిటీ ఇవ్వాలని ఒక నిర్ణయం తీసుకున్నారు. కానీ వంశీచంద్ పేరును అధిష్టానం ప్రపోజ్ చేసేసరికి..రాష్ట్ర నాయకత్వం గతంలో అనుకున్న విషయాన్ని తెరపైకి తెచ్చిందట. అయితే వంశీచంద్‌కు ఇవ్వాలంటూ ఏకంగా ఏఐసీసీ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీనే సూచిస్తుండటంతో రాష్ట్ర నాయకత్వం కూడా ఏమీ చేయలేని పరిస్థితుల్లో పడిపోయిందట.తన విషయంలో రాష్ట్ర నాయకత్వం సహకరించదనే ఆలోచనతో..వంశీ..ప్రియాంక గాంధీతో చెప్పిస్తున్నారని హస్తం పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. పార్టీకి జాతీయ స్థాయిలో వంశీ అవసరాలున్నాయని..రాజ్యసభ ఎంపీగా ఉంటే పార్టీకి మరింత ఉపయోగం ఉంటుందని ప్రియాంక గాంధీ చెబుతున్నారట. గతంలో జగిత్యాల ఎమ్మెల్యేగా ఓడిన జీవన్‌రెడ్డికి ఎంపీ సీటు ఇవ్వలేదా అంటూ గుర్తు చేస్తున్నారట హస్తం పార్టీ పెద్దలు.రాజ్యసభ రేసులోకి వంశీచంద్ రావడంతో..కొత్త కొత్త ఆశావహులు తెరమీదకు వస్తున్నారట. వంశీచంద్‌ను సాకుగా చూపి..గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన నేతల్లో చాలామంది రాజ్యసభ సీటు కోసం..తమ పేరును పరిశీలించాలని విజ్ఞప్తులు చేస్తున్నారట. ఇదే విషయాన్ని రాష్ట్ర నాయకత్వం పార్టీ అధిష్టానానికి చెబుతున్నా.. ప్రియాంకగాంధీ ససేమిరా అంటున్నారట. పార్టీకి ప్రస్తుతం దేశవ్యాప్తంగా డీసీసీల ఎంపికలో కీలక పాత్ర పోషిస్తున్నందున వంశీకి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారట. అలా తెలంగాణ నుంచి ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ సీట్లను భర్తీ చేసేందుకు..కాంగ్రెస్ అధిష్టానమే ఇప్పటికే అభ్యర్థులను ఫైనల్ చేసిందన్న చర్చ జరుగుతోంది. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనందున..నామినేషన్ల గడువులోపు ఈక్వేషన్లు ఏమైనా మారుతాయా? లేక అభిషేక్ మను సింఘ్వీ, వంశీచంద్‌రెడ్డి పేర్లు ఫైనల్ అయినట్లేనా అన్నది చూడాలి.

## వరంగల్ క్రికెట్ ప్రేమికులకు తీపి కబురు

**వరంగల్ :** వరంగల్ జిల్లాలోని క్రికెట్ ప్రేమికులకు, యువతకు గుడ్‌న్యూస్. త్వరలోనే అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం అందుబాటులోకి రానుంది. ఈ మేరకు చురుగ్గా పనులు జరుగుతున్నాయని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మె?ల్యే కడియం శ్రీహరి వెల్లడించారు. ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల శివారులో ఈ స్టేడియం అందుబాటులోకి రానుందని చెప్పారు. క్రికెట్ స్టేడియం అందుబాటులోకి వస్తే ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు కూడా జరిగే ఛాన్స్ ఉందని చెప్పుకొచ్చారు.తెలంగాణ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. తెలంగాణను దేశపు క్రీడా రాజధాని మార్చడమే లక్ష్యంగా సీఎం రేవంత్.. తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ 2025ను ప్రవేశపెట్టారు. ఈ పాలసీలో భాగంగా 2036 ఒలింపిక్స్‌లో మన రాష్ట్ర క్రీడాకారులు పతకాలు సాధించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు హైదరాబాద్ గచ్చిబౌలిలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నారు. దీని కోసం సుమారు 200 ఎకరాల భూమిని కేటాయించారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో మినీ స్టేడియాలు, ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో స్పోర్ట్స్ స్కూల్స్ నిర్మించాలని నిర్ణయించారు.అందులో భాగంగా.. వరంగల్ జిల్లాలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు రెడీ అయ్యారు. ఈ విషయాన్ని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెల్లడించారు. త్వరలోనే జిల్లాకు క్రికెట్ స్టేడియం వస్తుందని చెప్పారు. జిల్లాలో క్రికెట్ స్టేడియం ఆవశ్యకతను సీఎం రేవంత్ రెడ్డికి వివరించగా.. ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే కడియం తెలిపారు. ప్రస్తుతం స్టేడియం నిర్మాణానికి సంబంధించిన ఫైల్ ప్రభుత్వం వద్ద ఉందని అన్నారు. కాగా, జిల్లా యువత చాలా కాలంగా క్రికెట్ స్టేడియం కోసం ఎదురు చూస్తోంది. ఈ మేరకు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నేతృత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సీఎం సంబంధిత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల శివారులోని 163 నేషనల్ హైవేకు సమీపంలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా)కు భూమి ఉంది. దీంతో ఆ ప్రాంతంలోనే స్టేడియం నిర్మాణం చేపడితే అనుకూలంగా ఉంటుందనే నిర్ణయానికి అధికారులు వచ్చారు.దీంతో కుడా పరిధిలోని 30 ఎకరాల భూమి వివరాలను ఎమ్మెల్యేలు, ఎంపీలు రాష్ట్ర స్పోర్ట్స్ అండ్ యూత్ సర్వీసెస్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేశ్‌రంజన్‌కు అందజేశారు. ప్రస్తుతం ఈ ఫైల్ పెండింగ్‌లో ఉండగా.. త్వరలోనే స్టేడియం నిర్మాణానికి అనుమతులు రానున్నాయి. అదే జరిగితే క్రికెట్ ప్రేమికుల చిరకాల కోరిక తీరనుంది. వరంగల్ కేంద్రంగా అంతర్జాతీయస్థాయి మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చే ఛాన్స్ ఉంటుంది.

## డబుల్ కష్టాలు



**నల్గొండ :** ప్రజల కనీస అవసరాలు తీర్చేందుకు ఏ ప్రభుత్వమైనా సంక్షేమ పథకాలను అందజేస్తుంది. దానిలో భాగంగానే గత బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన పేదలకు కట్టించి అందజేసింది. ఇంతవరకు బానే ఉన్నా వాటి నిర్మాణంలో నాణ్యతతో కూడిన పనులు చేయకపోవడం, అక్కడ సరైన వసతులు కల్పించకపోవడంతో లబ్ధిదారులు అనేక చోట్ల అవస్థలు పడుతూనే ఉన్నారు. ఇదే విధానం మండలంలోని విభళ్ళ పురం, అప్పన్నగూడెం గ్రామాల్లోనూ కొనసాగుతోంది. 2020లో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ శంకుస్థాపన చేశారు. ఇండ్లు పూర్తయి రెండు సంవత్సరాలైనా అర్హులైన పేదలకు పంపిణీ చేయాలేదు. దీంతో సిపిఎం ఆధ్వర్యంలో 2023లో ధర్నా నిర్వహించగా అప్పుడు అర్హులను గుర్తించి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేశారు. కాంట్రాక్టర్ నాణ్యతలేని సిమెంటుతో కట్టడంతో ఆ ఇండ్లు ఇప్పుడు శిధిలావస్థకు చేరాయి.డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వచ్చిన సంతోషం లేకుండా కారు చీకట్లో మగ్గుతున్న కాలనీ వాసుల దుస్థితి కి నిదర్శనం మండల కేంద్రంతో పాటు విభళ్ళ పురం, అప్పన్నగూడెం గ్రామాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు గత ప్రభుత్వం నిరుపేదలను గుర్తించి ఇచ్చిన ఇండ్లు ఆర్భాటంగా ప్రారంభించి చేతులు దులుపుకొన్నారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో కనీస సౌకర్యాలైన కరెంట్, త్రాగునీటి సౌకర్యం , సి సి రోడ్లు లేక వచ్చిపోయే వర్షాలతో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి బురదతో కంపు కొడుతున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. అలాగే ఈగలు, దోమలు, స్వైరవిహారం చేస్తున్నాయని, కారుచీకట్లో పాములు, తేళ్ళ బెడదతో సతమతం అవుతున్నామని లబ్ధిదారులు ఇప్పటికే పలుసార్లు మండల అధికారులకు, గ్రామ పంచాయతీ కార్యదర్శి లకు పిర్యాదు చేసిన పలితం లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు.కనీసం గ్రామ పంచాయతీ సిబ్బంది కూడా చెత్త సేకరణకు రావడం లేదని దీంతో ఎక్కడ చెత్త అక్కడే పేరుకపోయి కంపు కొడుతున్నదని డబుల్ బెడ్ రూమ్ గృహ నివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు డబుల్ బెడ్ రూమ్ నివాసులు పడుతున్న ఇబ్బందులను అర్థం చేసుకొని అన్ని వసతులు కల్పించి అవస్థలు లేకుండా చూడాలని కోరుతున్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేసి త్రాగునీరు, విద్యుత్తు, సైడ్ డ్రైనేజీలు, సిసి రోడ్లు వసతులను కల్పించకుండా వదిలేసిసింధీ. అప్పటి నుండి ఇప్పటి వరకు సమస్యలు మాత్రం తేలడం లేదు. డబల్ బెడ్ రూమ్ గృహనివాసులు పడుతున్న ఇబ్బందులను అర్థం చేసుకొని ఈ ప్రభుత్వమైనా వసతులను కల్పించాలి.

## సంపాదకీయం

# యుద్ధ అంచున నిలిచిన ప్రపంచం!

పశ్చిమాసియాలో మళ్లీ సంగ్రామ మేఘాలు కమ్ముకొంటున్నాయి. “ఆపరేషన్ ఎపిక్ ఫూరీ” పేరుతో కొనసాగుతున్న అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్త సైనిక చర్యలు, వాటికి ప్రతిస్పందనగా ఇరాన్ చేసిన ప్రతిఘటన ప్రకటనలు, ఐక్యరాజ్య సమితి భద్రతామండలి అత్యవసర సమావేశం ఈ సమస్త పరిణామాలు ప్రపంచ రాజకీయ రంగాన్ని కుదిపేస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ దేశ రక్షణకు ముప్పు కలిగించే శక్తులను అడ్డుకోవడంలో వెనుకాడబోమని స్పష్టం చేయగా, ఇరాన్ విదేశాంగ మంత్రి హ్వస్సేన్ అమీరాబాద్ డొల్లాహియన్ తమ దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడంలో ఎటువంటి రాజీ ఉండదని ఘాటుగా ప్రకటించారు. మాటల స్థాయిలో ప్రారంభమైన ఈ ప్రతిస్పందనలు క్రమంగా సైనిక కదలికల రూపంలోనూ వ్యక్తమవుతు న్నాయి.ఈ ఉద్రిక్తతకు ప్రధాన కారణంగా ఇరాన్ అణు కార్యక్రమాన్ని అమెరికా, ఇజ్రాయిల్ పేర్కొంటున్నాయి. 2015 సంవత్సరంలో కుదిరిన ఉమ్మడి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక ఒప్పందం ప్రకారం ఇరాన్ అణు శక్తి అభివృద్ధిని నియంత్రించేందుకు అంతర్జాతీయ పర్యవేక్షణకు అంగీకరించింది. అయితే ఆ ఒప్పందం నుంచి అమెరికా వైదొలిగిన తర్వాత అనుమానాలు మళ్లీ పెరిగాయి. ఇరాన్ యురేనియం శుద్ధీకరణ స్థాయిని పెంచుతోందన్న ఆరోపణలతో ఇజ్రాయిల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తమ భద్రతకు ప్రత్యక్ష ముప్పు ఏర్పడుతుందనే భావనతో ఇజ్రాయిల్ ఇరాన్‌లోని కొన్ని అణు కేంద్రాలపై గగనతల దాడులు నిర్వహించినట్లు వార్తలు వెలువడ్డాయి. అమెరికా కూడా ఈ చర్యలకు మద్దతు తెలుపుతున్నదనే అభిప్రాయం బలపడుతోంది.ఇరాన్ మాత్రం తన అణు కార్యక్రమం పూర్తిగా శాంతియుత అవసరాలకేనని, విద్యుత్ ఉత్పత్తి మరియు శాస్త్రీయ పరిశోధనల కోసమేనని స్పష్టం చేస్తోంది. అంతర్జాతీయ అణుశక్తి పర్యవేక్షణ సంస్థ పర్యవేక్షణలోనే తమ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని పేర్కొంటోంది. అయితే ఇజ్రాయిల్ దృష్టిలో ఇరాన్ అణు సామర్థ్యం భవిష్యత్తులో ప్రాణాంతక ముప్పుగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అమెరికా?ఇజ్రాయిల్ చర్యలు రక్షణాత్మక చర్యలేనని వారు వాదిస్తున్నారు.ఈ పరిణామాల నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అత్యవసర సమావేశం నిర్వహించి తక్షణ సంగ్రామ విరమణకు పిలుపునిచ్చింది. చర్చల ద్వారానే సమస్య పరిష్కారం సాధ్యమని సభ్యదేశాలు అభిప్రాయ పడ్డాయి. రష్యా, చైనా వంటి దేశాలు ఈ దాడులను తీవ్రంగా ఖండించగా, యూరోపియన్ దేశాలు పరిస్థితి అదుపు తప్పకూడదని హెచ్చరించాయి. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి శాంతి సాధనకే ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అయితే భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశాల మధ్య ఉన్న విభేదాలు ఏకాభిప్రాయ నిర్ణయానికి అడ్డంకిగా నిలుస్తున్నాయి. గల్ఫ్ ప్రాంత దేశాలు అత్యవసరంగా సమావేశ మవడం పరిస్థితి తీవ్రతను స్పష్టంగా తెలియ జేస్తోంది. సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతర్, కువైట్ వంటి దేశాలు తమ భూభాగం సంగ్రామ రంగంగా మారుతుందేమోనని ఆందోళన చెందుతున్నాయి. హార్ముజ్ సముద్ర మార్గం ప్రపంచ చమురు రవాణాకు కీలక జీవనాధారం. ప్రపంచ చమురు సరఫరాలో పెద్ద భాగం ఈ మార్గం ద్వారా సాగుతుందని అంచనాలు చెబుతున్నాయి. అక్కడ సైనిక ఘర్షణలు ఉద్ధృతమైతే ప్రపంచ ఇంధన సరఫరా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుంది. ఇప్పటికే చమురు ధరల్లో పెరుగుదల సూచనలు కనిపిస్తున్నాయి. జర్మనీ, బ్రిటన్ వంటి దేశాలు అమెరికాకు మద్దతుగా నిలిచే అవకాశమున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. అయితే ప్రత్యక్ష సైనిక ప్రవేశంపై యూరోపియన్ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. మరోవైపు రష్యా, చైనా ఈ దాడులను ఆధిపత్య రాజకీయాల ప్రతిబింబంగా విమర్శిస్తున్నాయి. ఉక్రెయిన్ సంగ్రామం కారణంగా ఇప్పటికే పాశ్చాత్య దేశాలతో విభేదాలు ఉన్న రష్యా, ఈ సందర్భాన్ని వ్యూహాత్మకంగా వినియోగించుకునే అవకాశముంది.మూడవ ప్రపంచ సంగ్రామం సంభవిస్తుందా అన్న ప్రశ్న ఇప్పుడు గంభీరంగా వినిపిస్తోంది. ఒకవేళ అమెరికా ఇజ్రాయిల్ యూరోపియన్ దేశాలు ఒకవైపు, ఇరాన్‌కు మద్దతుగా రష్యా?చైనా మరోవైపు నిలిస్తే ప్రపంచం రెండు శిబిరాలుగా విడిపోయే ప్రమాదం ఉంది. ఆధునిక సంగ్రామ స్వరూపం కేవలం భూయుద్ధంతో పరిమితం కాదు. క్షిపణి దాడులు, మానవ రహిత యంత్ర వాహనాల వినియోగం, సమాచార యుద్ధం, ఉపగ్రహ వ్యవస్థల విధ్వంసం, ఆర్థిక ఆంక్షలు?ఇవన్నీ సమాంతరంగా జరుగుతాయి. అణు ఆయుధాల వినియోగం అనే భయానక అంశం ప్రపంచాన్ని కుదిపేస్తోంది. అణు సంగ్రామం జరిగితే మానవజాతి, పర్యావరణం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తిరుగులేని నష్టం సంభవిస్తుంది. ప్రపంచ ఇంధన మార్కెట్లపై ఈ సంగ్రామ ప్రభావం అత్యంత తీవ్రమైనదిగా ఉంటుంది. చమురు ధరలు పెరిగితే రవాణా వ్యయం, ఉత్పత్తి వ్యయం పెరుగుతాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు ద్రవ్యోల్బణంతో ఇబ్బందులు ఎదుర్కొంటాయి. అంతర్జాతీయ వాణిజ్యం మందగిస్తుంది. మూలధన ప్రవాహాలు క్షీణిస్తాయి. ఈ ప్రభావాలు సంగ్రామంలో ప్రత్యక్షంగా పాల్గొనని దేశాలకూ తాకుతాయి.భారత దేశానికి ఈ సంక్షోభం నుంచి మినహాయింపు ఉండదు. భారత్ తన చమురు అవసరాల్లో గల్ఫ్ దేశాలపై ఎక్కువగా ఆధార పడుతోంది. చమురు ధరల పెరుగుదల భారత ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడిని పెంచుతుంది. విదేశీ మారక నిల్వల వినియోగం పెరుగుతుంది. గల్ఫ్ ప్రాంతంలో పనిచేస్తున్న లక్షలాది భారతీయుల భద్రత ప్రశ్నార్థక మవుతుంది. అవసరమైతే వారిని సురక్షితంగా తరలించాల్సిన పరిస్థితి తలెత్తవచ్చు. ఎరువులు, సహజ వాయువు, పెట్రో ధరలను రసాయనాల సరఫరాపై కూడా ప్రభావం పడుతుంది. ఇరాన్ అంతర్గత పరిస్థితులు కూడా ఈ సంగ్రామ వాతావరణంతో సంక్లిష్టంగా మారుతున్నాయి. ఆర్థిక ఆంక్షలతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న దేశానికి సైనిక ఒత్తిడి మరింత భారంగా మారుతుంది. అయితే విదేశీ దాడులు దేశంలో జాతీయత భావాన్ని పెంచి ప్రభుత్వానికి మద్దతు కూడగట్టే అవకాశమూ ఉంది. అమెరికా?ఇజ్రాయిల్ చర్యలను తమ సార్వభౌమాధికారంపై దాడిగా చిత్రీకరిస్తూ ఇరాన్ ప్రజలను సమీకరించే ప్రయత్నం జరుగుతోంది. సమగ్రంగా పరిశీలిస్తే ఈ సంక్షోభం కేవలం ప్రాంతీయ ఘర్షణ మాత్రమే కాదు; ప్రపంచ శక్తి సమీకరణాలను ప్రభావితం చేసే పరిణామం. అణు వ్యాప్తి నిరోధక విధానాల భవిష్యత్తు, అంతర్జాతీయ దౌత్య వ్యవస్థ విశ్వసనీయత, ఇంధన భద్రత?ఈ అంశాలన్నీ దీనితో ముడిపడి ఉన్నాయి. మూడవ ప్రపంచ సంగ్రామం అనేది అత్యంత దుర్భర పరిణామం. అది జరిగితే మానవ నాగరికతకే ముప్పు. అందువల్ల ప్రపంచ నాయకులు వివేకంతో వ్యవహరించి చర్చల ద్వారానే శాశ్వత శాంతిని సాధించాలి. శక్తి ప్రదర్శన కంటే పరస్పర గౌరవం, ప్రతీకారం కంటే సంభాషణ, ఆధిపత్యం కంటే సహకారం ఇవే స్థిరమైన శాంతికి మార్గదర్శకాలు. ప్రపంచం యుద్ధ అంచున నిలవకుండా, శాంతి మార్గంలో ముందుకు సాగాలని మానవజాతి ఆకాంక్షిస్తోంది.

# అనితర సాధ్యం... బులుసు త్యాగం

దేశ స్వాతంత్ర్య పోరాటంలో సర్వం త్యాగం చేసిన ఒక చిత్తశుద్ధి, అంకిత భావం, నిజాయితీ గల వ్యక్తి తీవ్ర నిరాదరణకు గురైన విషయం చాలా మందికి తెలియనిది. ఒక రాష్ట్రం ఏర్పాటు కోసం కృషి చేసిన నేతను రాష్ట్రం ఏర్పడిన సందర్భంలో ఆయన అహ్వానింప బడని బాధాకరమైన నేపధ్యం ఉంది. రాష్ట్ర శాసన సభాపతిగా పని చేసిన ఓ నేత స్వాతంత్ర్య సమర యోధుల పెన్షన్ పొందలేని దుస్థితికి, తిండిలేక భిక్షాటనం చేసిన హృదయ విదారక సన్నివేశాలకు ఆంధ్ర రాష్ట్ర చరిత్ర మౌన సాక్షీభూతంగా నిలిచి ఉంది. కాంగ్రెస్ పార్టీ, స్వాతంత్ర్యానికి ముందు, అధిక శాతం దేశభక్తుల, త్యాగ ధనుల పార్టీగా వుండేది. అలాంటి నిస్వార్థ త్యాగాల భాగ స్వామ్య ఫలితంగానే స్వాతంత్ర్య సాధన సాధ్యమైంది. చెట్టు పేరు చెప్పుకుని కాయలు అమ్ముకునే నేటి నాయకుల లాగా కాకుండా, స్వాతంత్ర్య సాధనకు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని, ఎన్నో రకాలుగా లక్ష్య సాధనలో సకలం ఫణంగా పెట్టి పోరాడిన వారెందరో. లక్ష్య సాధన జరిగాక, నిర్లక్ష్యానికి గురైన వారింకెందరో. అలాంటి వారిలో అగ్రగణ్యుడు... బులుసు సాంబమూర్తి. సుఖమయ జీవితా న్ని గడపడానికి అన్ని అవకా శాలు అంది పుచ్చుకుని కూడా, దేశ స్వాతంత్ర్యం కోసం సర్వం త్యాగం చేసిన త్యాగధనుడు, అసలు సిసలైన దేశభక్తుడు బులుసు సాంబమూర్తి. స్వాతంత్ర్యోద్యమంలో ఆయన పాత్ర మరచి పోలేనిది. మహాత్మా గాంధీ కన్నా ముందుగానే కొల్లాయి కట్టి సామాన్య ప్రజలతో మమేక మైన నిస్వార్థ సేవా పరాయణుడు బులుసు సాంబమూర్తి అని, ఈతరం వారికి తెలియకపోవచ్చు. ఆయన తూర్పు గోదావరి జిల్లా, దుళ్ల గ్రామంలో 1886, మార్చి 4 న జన్మించారు. ఆయన తండ్రి సుబ్బావాధానులు వేదపండితులు. కుటుంబమంతా దానధర్మాలు చేస్తూ ధార్మిక జీవనం సాగించే వారు. మద్రాసు విశ్వ విద్యాలయం నుండి బి.ఏ. పరీక్షలో ఉత్తీర్ణులై, విజయనగరం మహారాజా కళా శాలలో కొంతకాలం భౌతిక శాస్త్రం బోధించారు. స్వేచ్ఛా స్వభావి అయిన సాంబమూర్తికి ఈ ఉద్యోగం అంతగా నచ్చలేదు. ఉద్యోగానికి రాజీనామా చేసి న్యాయవాద వృత్తి చేపట్టాలని నిర్ణయించుకున్నారు. బి.ఎల్. పరీక్షలో ఉత్తీర్ణులై 1911లో కాకినాడలో న్యాయవాద వృత్తిని స్వీకరించి, మహాత్ముని పిలుపు నందుకొని న్యాయవాద వృత్తిని వదలి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. 1919లో హోంరూల్ ఉద్యమంలోను, 1930లో ఉప్పు సత్యాగ్రహంలోను, 1932లో శాసనో ల్లంఘన ఉద్యమంలో, 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో, పలు సత్యాగ్రహాలలో పాల్గొని కారాగార శిక్షలు అనుభవించారు. 1927లో నాగపూరు పతాక సత్యాగ్రహ దళానికి నాయకులు గాను, 1928 లో హిందూస్థానీ సేవా దళానికి అధ్యక్షులుగా పని చేశారు. తరువాత తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెసు కమిటీకి అధ్యక్షులుగా, 1929లో అఖిల భారత కాంగ్రెసు కమిటీలో సభ్యులుగా వ్యవహ రించారు. 1930 ఉప్పు సత్యాగ్రహ సమయంలో తన సహచరులతో చొల్లంగి సముద్ర తీరానికి వెళ్ళి ఉప్పును తయారు చేశారు. సాంబ మూర్తిని అరెస్టుచేసి వెల్లూరు జైలు కు తరలించారు. 1935-37 మధ్య కాలంలో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటీ కార్యదర్శిగా వ్యవహ రించారు. 1935లో మద్రాసు ప్రోవిన్షియల్ ఎస్సెంబ్లీకి జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి నప్పుడు, చక్రవర్తి రాజగోపాలాచారి ముఖ్యమంత్రిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. సాంబమూర్తి 1937 నుంచి 1942 వరకూ స్పీకరుగా ఉన్నారు. 1937లో కాంగ్రెసు మంత్రివర్గ పరిపాలనలో మద్రాసు రాష్ట్ర శాసనసభకు సభాపతిగా విధులను సంప్రదా యాలకు అనుగుణంగా, మర్యా దగా, అద్వితీయంగా నిర్వహించి సభకు గౌరవ ప్రతిష్ఠలను సమకూర్చారు. 1923 లో అఖిల భారత కాంగ్రెస్ మహాసభ కాకినాడలో మూడు రోజులపాటు నిర్వహించిన సభకు దేశంలోని ప్రముఖ కాంగ్రెస్ నాయకులు రాగా, ఆహ్వాన సంఘ అధ్యక్షులుగా దేశభక్త కొండ వెంకట ప్పయ్య, కార్యదర్శిగా ఉండగా, ఆ సమయంలోనే సాంబమూర్తి ఏకైక కుమారుడు మరణించాడు. అయినా ఏ విధమైన అసౌకర్యం కలగకుండా అద్భుతమైన బులుసు బాధ్యతగా ఏర్పాట్లు చేసారు. జరిగిన విషాదం తెల్సుకున్న గాంధీజీ ఆ సభ సెషన్ ను ఆపేశారట. భారత కోకిల సరోజినీ నాయుడు సాంబ మూర్తి స్థిత ప్రజ్ఞతకు చలించి అప్పటి కప్పుడు ఆ సభలో ఆశువుగా గీతాన్ని ఆలపించారట. ఉప్పు సత్యాగ్రహ సమయంలో ఉప్పు మీద పన్ను ఎత్తివేసే వరకు ఆహారంలో ఉప్పు వేసుకోనని ప్రతిజ్ఞ చేయడాన్ని బట్టి అయన వ్యక్తిత్వం అర్థం అవుతుంది.1937లో మద్రాసు రాష్ట్ర శాసనసభకు స్పీకర్ గా ఎన్నికై, పని చేసి, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనేందుకు ఆ పదవి వదులు కున్న దేశభక్తులు బులుసు. చెన్నపట్నంలో ఆంధ్ర మహాసల ఏర్పాటులో చురుకైన పాత్ర పోషిం చటమే కాక తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలన్న ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించారు. తెలుగు రాష్ట్ర ఏర్పాటును రాజాజీ, నెహ్రూ వ్యతిరేకించారు. పొట్టి శ్రీరాములు నిరాహార దీక్షకు సిద్ధమైతే, ఆయన ను తన ఇంటినే వేదికగా చేసుకో మన్న నాయకుడు సాంబ మూర్తి, అమరజీవి ప్రాణత్యాగం చేసిన ఆ ఇంటిని స్మారక భవనంగా వదిలి కాకినాడకు చేరిన త్యాగమూర్తి బులుసు సాంబమూర్తి. 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడ్డాక, కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్ర అవతరణకు నెహ్రూ విచ్చేసినా, కాంగ్రెస్ నాయకులు నెహ్రూకు భయపడి బులుసు సాంబమూర్తికి కనీసం ఆహ్వానం కూడా పంపని నాటి కాంగీయుల వ్యవహార శైలి బులుసుకు చేసిన అవమానికి, నిర్లక్ష్యానికి, నిరాదరణకు పరాకాష్ట. దేశస్వాతంత్ర్యం కోసం ఆదాయం ఇచ్చే న్యాయవాద వృత్తిని ఆయన వదులు కున్నారు. ఆంధ్రరాష్ట్రం కోసం మద్రాసులో తన ఇల్లు వదులు కున్నారు. స్వాతంత్ర్యం వచ్చింది. ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. కానీ బులుసు లాంటి త్యాగమూర్తి ఒంటరివారయ్యారు. భార్య గతించింది. ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. ఇక మద్రాసులో నివాసం అనవసరంగా భావించి, సొంత ఊరు కాకినాడ చేరితే జీవితం బాగుపడుతుందని అనుకున్నారు. ఆయన నమ్ముకున్న కాకినాడలో పరిస్థితులు మరింతగా మారి పోయాయి. ఒకప్పుడు మహర్షి అని గుర్తింప బడి,ఆయన దర్శనం కోసం వెళుతున్నామని నలుగురిలో చెప్పుకుని బులుసు గారింటికి వెళ్ళటం గొప్పగా భావించిన కాంగ్రెస్ వాదులు, మహర్షి ఎదురుగా కనిపించినా పట్టించు కోని దుస్థితి. ఒకప్పుడు ఆయన్ని ఆరాధించిన వారే ముఖం చాటేశారు. ఆయన ఉన్నత స్థితిలో ఉన్నప్పుడు అన్నిరకాలుగా సహాయం పొందిన వారు, సాంబమూర్తి ఎదురు పడితే డబ్బులు అడుగుతాడని తప్పుకుని తిరిగారు. ఆంధ్రరాష్ట్రం ఏర్పడ్డాక, సాంబమూర్తికి వయసు మీద పడింది. పేదరికం వెంటాడింది. వేళకు తినలేని పరిస్థితి. ఆదుకునే వారు లేకుండా పోయారు. ఒకనాడు కాకినాడ వీధుల్లో ఖరీదైన వాహనం మీద లాయర్ గా తిరిగిన సాంబమూర్తి చివరి రోజుల్లో అదే వీధుల్లో కంటి చూపు మందగించి, కాళ్ళకు సరైన చెప్పులు లేక చిరిగిన దుస్తులతో, చేతికర్ర సహాయంతో తిరుగుతూ భిక్షాటనం చేయాల్సిన పరిస్థితి దాపురించింది.ప్రతిరోజూ సాయంత్రం వేళ దేవాల యాల దగ్గర సమయం గడిపే వారు. దేవాలయాలమ దర్శించి అక్కడి ప్రసాదాలతో కడుపు నింపుకున్నారు. కొన్ని సందర్భా లలో దేవాలయం ముందు బిచ్చగాళ్ళతో చేరి క్షుద్బాధ భరించ లేక చేతులు చాపాడని అంటారు. ఆర్థిక సహాయం కోసం ప్రభుత్వానికి అర్జీ పంపితే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయం నుండి... బులుసు సాంబమూర్తి అనే ఆయన స్వాతంత్ర్య సమర యోధుడు అనేందుకు తగిన ఆధారాలు ప్రభుత్వ రికార్డులలో లేవని సమాధానం వచ్చిందట. దేశం, నాయకులు విస్మరించిన దేశభక్తుల జాబితాలోని ఒక ప్రముఖుడు మహర్షి బులుసు సాంబమూర్తి.పేదరికంలో మగ్గుతున్న పొంబ మూర్తి గురించి తెలుసుకున్న నాటి కేంద్ర హోమ్ శాఖ మంత్రి గోవింద్ వల్లభ్ పంత్ మాత్రమే ఆర్థిక సహాయం అందించారని, రాష్ట్ర నేతలు పట్టించుకోలేదని చెపుతారు. పేదరికం దానికి తోడు మానసిక వ్యథ తోడు కాగా చివరికి 1958 ఫిబ్రవరి 3న కాకినాడలోనే బులుసు సాంబమూర్తి అంతిమ శ్వాస విడిచారు.

# ‘కుమ్మెర’ లేవనెత్తుతున్న ప్రశ్నలు

భారత రాజ్యాంగం సమానత్వం అనే మహోన్నత విలువలపై నిర్మించబడింది. ఆ పునాదులకు రూప శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్. కానీ ఇప్పటికీ రాజ్యాంగం ఆశించిన సమానత్వం ఆమడదూరంలోనే ఉన్నది. అయితే, హిందువులంతా బంధువులమనే భారతీయ సమాజంలో దేవాలయం దగ్గర కులం పేరుతో జరిగిన దాడి మరోమారు హిందు ధర్మంలో అసమానతలను నొక్కిచెబుతున్నది. ఇదీ హిందుత్వానికి మాయనిమచ్చ. ఇటీవల నాగర్ కర్నూలు జిల్లా, కుమ్మెర గ్రామంలో మల్లన్న స్వామి జాతరలో బిసి చాకలి కుటుంబంపై జరిగిన దాడి దేశాన్ని కుదిపేస్తుంది. రెండు నెలల పసిబిడ్డను అత్యంత క్రూరంగా కాలితో తన్ని హత్య చేసిన ఆ గ్రామ అగ్రకుల పెత్తందారుల ఆధిపత్యం మానవత్వానికి మచ్చగా మిగిలింది. ఒక శిశువు ప్రాణం కుల అహంకారానికి బలి కావడం కేవలం నేరమే కాదు, అది మానవత్వంపై జరిగిన దాడి. దేవాలయ ప్రవేశం, ఆధ్యాత్మిక హక్కుల విషయంలో సబ్బండ కులాలపై వివక్ష- ఆధునిక భారతదేశంలోనూ బహిర్గతమవుతుంది. శివుని సమానత్వానికి ప్రతిరూపమైన మల్లన్న దేవుడి గుడిలో జరిగిన ఘటన అనేక ప్రశ్నలను లేవనెత్తుతుంది. ఇది కేవలం ఒక గ్రామ సమస్య కాదు, ఆధ్యాత్మిక నిర్మాణంలో దాగి ఉన్న అసమానతలకు ప్రతిబింబంగా నిలిచింది. ఈ అన్యాయంపై మొట్టమొదట గళమెత్తిన నాయకుడు బిసి, ఎస్‌సి, ఎస్‌టి ఎస్టీల విముక్తి ఉద్యమ రథసారధి డాక్టర్ విశారదన్ మహరాజ్. ఆయన హిందూ ధర్మంలో బిసి, ఎస్‌సి, ఎస్‌సిల వాటా ఎంత? అని వేసిన ప్రశ్న పలువురుని ఆలోచింపచేస్తుంది. ప్రపంచానికే విద్య, విజ్ఞానం, సంస్కృతి పంచిన గొప్ప దేశం మనది. ‘హిందువులంతా బంధువులు అనే నినాదం మహోన్నతమైన ది. కానీ ఆ నినాదం వాస్తవ జీవితంలో ప్రతిబింబిస్తుందా? అనేది ప్రశ్నార్థకమే! కుమ్మెర గ్రామ ఘటన దీనికి సజీవ సాక్ష్యం. వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న వర్ణ-కుల వ్యవస్థ ఈ దుర్ఘటనకు మూలకారణం. మేమే అధిపతులం అనే మనస్తత్వం పెరిగి, అది బలహీనులపై బలవంతుల దౌర్జన్యానికి పురిగొల్పుతున్నది. దీంతో ప్రజాస్వామ్య ఆలోచనలను పాతరేస్తూ ప్రతిచోట కులస్వామ్య కోరలు రాజ్యమేలుతున్నాయి. ఇదీ దేవాలయాల నిర్వహణ కమిటీలో, పీఠాధిపతుల్లో, ప్రధాన పూజారి స్థానాల్లో, ఆధ్యాత్మిక నిర్ణయ కేంద్రాల్లోనూ స్ఫురిస్తోంది. ఈ ఆధ్యాత్మక ప్రదేశాలలో అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యం లేకపోవడమే ఈ ఆధిపత్యానికి నిదర్శనం. ఏ దేవుడైన సమానత్వం బోధిస్తాడు. కానీ అగ్రకులాలు ఆధిపత్యం ఒక వ్యవస్థను నిర్మించుకొని బిసి, ఎస్‌సి, ఎస్‌టిలను శూద్రులుగా, బానిసలుగా చూస్తున్నారు. అయినా దళిత, బహుజనులు హిందువులంతా బంధువులుగానే భావించుకుంటూ వేల సంవత్సరాలుగా హిందూ మతాన్ని కాపాడుతున్నారు. చారిత్రకంగా వారికి ఆయుధం, భూమి, సంపద, విద్య వంటి ప్రధాన వనరులపై సమాన హక్కులు లభించలేదు. ఈ సామాజిక కట్టుబాట్లు, అసమానతల వల్ల దేశ రక్షణ, ఆర్థిక స్థితి, సామాజిక ఐక్యత దెబ్బతిన్నది. ఉదాహరణకు భారతీయ హిందురాజు పృధ్వీరాజ్ చౌహాన్ కాలంలో జరిగిన తరైన యుద్ధాలలో మహమ్మద్ గోరి భారతదేశాన్నీ ఆక్రమించాడు. ఈ యుద్ధంలో బహుజనుల భాగస్వామ్యం లేకపోవడం వలన దేశం ఆక్రమణకు గురైంది. వారి చేతిలో అధికారం ఉండి ఉంటే ఎవరు కూడా కన్నెత్తి చూసే సాహసం చూపేవారు కాదు. ఇప్పటికీ భారతదేశంలో కొన్ని కులాల చేతిలో అధికారం కేంద్రీకృతం కావడం వల్లనే అభివృద్ధి సాధించలేక పోతుంది. దీనికి ప్రధాన కారణం హిందూమతంలోని బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు అధికారం ఇవ్వకపోవడమే. నేటికీ గ్రామ స్థాయి నుంచి పట్టణాల వరకు హిందు ధార్మిక కార్యక్రమాలలో అగ్రకులాధిపత్యం రాజ్యమేలు తుందనడానికి కుమ్మెర ఘటన మనకు ఒక గట్టి హెచ్చరిక. ఇది ఆధునిక భారత దేశంలో మానవ హక్కుల ఉల్లంఘన. దేవాలయం ఒక వర్గం సొత్తు కాదు, భక్తి కులాన్ని అడగదని, దేవుడు జాతి పత్రం చూడడు అనే మాటలు ‘ఆదర్శాలు’ గానే మిగులుతు న్నాయి. రోజురోజుకు భయంకరమైన కులం కుట్రలు చాపకింద నీరులా విజృంభిస్తున్నాయి. వెనుకబడిన కులాలను తమ ఆధీనంలో ఉంచుకోవాలనే ఆధిపత్య పోకడలు కొనసాగున్నాయి. ఇప్పటికీ అక్కడక్కడ గ్రామాల్లో అట్టడుగు కులాల ఆలయ ప్రవేశాన్నీ అడ్డుకోవడం, సామాజికంగా బహిష్కరించడం వంటి ఘటనలు వెలుగులోకి వస్తుండడం ఇందుకు ఉదాహరణ. అదేవిధంగా ఆ వర్గాలు రాజ్యాంగం కల్పించిన అధికారాన్ని కూడా చెలాయించడాన్ని ఓర్చుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో కుమ్మెర ఘటనలో డాక్టర్ విశారదన్ పోరాటం హిందు స్వాభిమానానికి, మానవ గౌరవానికి, రాజ్యాంగ ఆత్మకు సంబంధించిన పోరాటంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఆయన నికార్సయిన పోరాటానికి పలువురు సామాజిక ఉద్యమకారులు, మేధావులు, రాజకీయ పార్టీలు మద్దతిస్తున్నాయి. సమాజం ముందుకు వెళ్లాలంటే అగ్రకులాలు ఆధిపత్య భావాలను విడిచిపెట్టి ప్రజాస్వామ్య గణతంత్ర విలువలను గౌరవించాలి.రాజ్యాంగ సమానత్వం పేజీల్లో మాత్రమే కాకుండా ఆలయ గర్భగుడిలోనూ, మన హృదయాల్లోనూ ప్రతిఫలించాలి. ఇందుకై సంస్థాగత మార్పులు అవసరం. దేవాలయాల నిర్వహణలో సమాన ప్రాతినిధ్యం కావాలి. కుల ఆధారిత అహంకారాన్ని సామాజికంగా ఖండించే ధైర్యం ప్రతి ఒక్కరిలో రావాలి. కుమ్మెర గ్రామ ఘటనలో చాకలి కుటుంబంపై దాడి చేసిన నిందితుల్ని వెంటనే శిక్షించి బాధితులకు న్యాయం చేయాలి. ఆధ్యాత్మిక ప్రపంచంలో అణగారిన వర్గాలను భక్తులుగా మాత్రమే చూడడం సరికాదు. వారికి నాయకత్వం, నిర్ణయాధికారం, గౌరవప్రదమైన ప్రాతినిధ్యం లభించినప్పుడే హిందువులంతా బంధువులు అవుతారు. అదే విధంగా అట్టడుగు వర్గాలు కేవలం భక్తులుగా మిగిలిపోతే సరిపోదు. శివుని సామాజిక సమానత్వం, సమ్మక్క-సారలమ్మల, చాకలి ఐలమ్మల పోరాటంబాటలో నడిచినప్పుడే ఆధిపత్యం అంతమవుతుంది. అప్పుడే రాజ్యాంగం కోరుకున్న సమానత్వం అమలవుతుంది. లేదంటే బిసి, ఎస్‌సి, ఎస్‌టిలు అంధభక్తులుగా మిగిలి, ఆధిపత్య వర్గాల చేతుల్లో బలవడమే అవుతుంది. ఇప్పటికైనా అట్టడుగు వర్గాలంతా మేల్కొని కుమ్మెర ఘటనలో న్యాయం కోసం ఉద్యమించాలి. లేదంటే చరిత్రలో తప్పుచేసిన వాళ్ళుగా మిగిలిపోతారు.

# నారసింహుడి తెప్పోత్సవాలు

దక్షిణ కాశిగా, హరిహర క్షేత్రంగా, నవనారసింహ క్షేత్రాలలో నొకటిగా వాసికెక్కిన సాంప్రదాయాల సిరియైన ధర్మపురి క్షేత్రంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో అంతర్భాగంగా శ్రీ ఉగ్ర నారసింహ, శ్రీవేంకటేశ్వర స్వాముల తెప్పోత్సవ, డోలోత్సవాలు మార్చి 4,5వ తేదీలలో బుధ, గురు వారాలలో వరుసగా జరుగనున్నాయి. ధర్మపురి పట్టణ నడి బొడ్డున వెలసి విశేష పౌరాణిక, చారిత్రిక, ఐతిహాసిక ప్రాధాన్యతను కలిగిన, దక్షిణ భారతావని లోనే అతిపెద్దదిగా భావించబడే బ్రహ్మ పుష్కరిణి (కోనేరు )లో మూడు రోజులు పగలు మూడు గంటల నుండి రాత్రి తొమ్మిది వరకు నిర్వహించే కార్యక్రమాలలో స్వాముల ఉత్సవ మూర్తులను ప్రత్యేక ప్రత్యేక నిర్మిత బల్లకట్టుపై ఆశీనుల గావించి, కోనేటి నీటిపై ఐదు ప్రదక్షిణలు గావించడం అనాదీగా క్షేత్రంలో ఆచరిస్తున్న సత్సాంప్రదాయం. హిరణ్య కశిపుని సంహారానంతరం, ఉగ్రనారసింహుని శాంతింప జేసేందుకు బ్రహ్మాది దేవతలు తపో, యజ్ఞ ధ్యానాది సత్కర్మల నొనరించిన నేపథ్యంలో, బ్రహ్మ తన మంత్ర దండంతో ఈ క్షేత్రంలో భూమిన త్రవ్వి కుండమును నిర్మించి, అందలి జలమున స్నానమాడి, శ్రీనృసింహుని గురించి తపమొనరించి, అనుగ్రహం పొంది ఆ దేవదేవుని మందిరాన వసింపుమని వరం పొందడం జరిగిం దని, బ్రహ్మ దేవుడు స్నానమాచరించిన స్థలానికే “బ్రహ్మ పుష్కరిణి”, యని పేరు వచ్చినదని పృథు మహారాజుకు నారదమునీంద్రుడు వివరించి నట్లు నైమిశారణ్యంలో శౌనకాది మహర్షులకు సూత పౌరాణికులు చెప్పినట్లు స్కంద, బ్రహ్మాండ పురాణ అంతర్గత క్షేత్ర మహాత్మ్యం ప్రాచీన గ్రంథాలు విశదీకరిస్తున్నాయి. సంతాన హీనుడైన లక్ష్మణుడను బోయరాజు, నారద మునీంద్రుని ద్వారా నారసింహ మంత్రో పదేశం గావింపబడి, ఆ మంత్ర జప బల ముచే పుత్ర ప్రాప్తి నొందెనని, అయితే లక్ష్మణునకు ధర్మపురి క్షేత్రంలో నిద్రించిన సమయంలో స్వప్నమందు శ్రీనృసింహుడు దర్శనమిచ్చి బ్రహ్మ పుష్కరిణికి నలు వైపులా సోపానాలు , మధ్య బాగాన వేదికను, శ్వేత వరాహ తీర్థం నుండి కోనేరు లోనికి జలము వచ్చు మార్గమును నిర్మింపుమని ఆజ్ఞాపించెను అని, భగవదాదేశానుసారం, ఆ ఎరుకల రాజు అన్నియూ నిర్మించి, అందులకై అయిన ఖర్చును రాసి పెట్టెనని, ఫలితంగా నృసింహుడు ఆగ్రహించి పుష్కరిణికి రానని ప్రకటించి, తిరిగి లక్ష్మణుని ప్రార్థన పై, ప్రతి సంవత్సరం పాలుణ శుక్ల పూర్ణిమనాడు, విహారార్థం సుముఖుడనై ఏతెంచ గలనని వరమిచ్చినట్లు పురాణాలు స్పష్ట పరుస్తున్నాయి. ఉదయగిరి సీమను ఏలిన రాయల దండులో కరీంనగరం మండలం లోనికి ప్రవేశించిన జూపల్లి సంతతిలోని వాడగు జూపల్లి ధర్మా రాయుడు , తన నాటికేయున్న బ్రహ్మపుష్కరిణి నలువైపులా సోపానాలను, మధ్యలో వేదికను నిర్మింప జేసెనని, తరువాత శాలివాహన శకం 1566 పార్థివ సంవత్సరంలో (క్రీ.శ.1645 ) చింతల నరుస బోయని కుమారుడగు తిరుమలయ పుష్కరిణి చుట్టూ ప్రాకారం మధ్య వేదికపై భోగ మండపం నిర్మింప జేసి దీపారాధనలతో , ఓడలోన మహోత్సవముతో శ్రీనృసింహుని కొలిచెనని పుష్కరిణిలోని శాసనం ద్వారా తెలుస్తున్నది.

# ఉప సర్పంచ్ నిజాం సర్కార్ తండ్రి షాందూ పాషా మరణం చాలా బాధాకరం

## మృత దేహానికి నివాళులు అర్పించిన ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**దకల్వకుర్తి మండలం మార్చాల గ్రామ ఉప సర్పంచ్ నిజాం సర్కార్ తండ్రి షాందూ పాషా రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగింది.విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మాజీ కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం తో కలిసి వారి నివాసానికి చేరుకొని పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీ తరఫున ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, అకాల మరణం చాలా బాధాకరం. కుటుంబానికి పార్టీ తరఫున కుటుంబానికి అండగా ఉంటామని అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్చాల సర్పంచ్ కృష్ణ రెడ్డి, బీ ఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు నాగులు నాయక్, మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, మాజీ సర్పంచ్ దేశం వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కడల సంతోష్ మల్లేష్, నారాయణపూర్ మాజీ సర్పంచ్ అంజి నాయక్, వార్డు సభ్యులు ఆనంద్, బాలరాజు, మల్లేష్, నరేష్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు లింగం రమేష్, కిషోర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాపాలనకు.. ప్రగతిప్రణాళిక..




**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి జిల్లా** జిల్లాలో మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. అయిదు దశల్లో 99 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రకారం ప్రణాళిక శాఖ ఈ కార్యక్రమానికి నోడల్ శాఖగా వ్యవహరిస్తుందన్నారు.ఏప్రిల్ 2న గ్రామ స్థాయిలో గ్రామ సభల నిర్వహణ, ఏప్రిల్ 16న మండల స్థాయిలో కార్యక్రమం, మే 2న నియోజకవర్గ స్థాయి కార్యక్రమం, మే 22న జిల్లా స్థాయిలో కార్యక్రమం, జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. శాఖల వారీగా 10 వివిధ థీమ్ లతో 99 రోజుల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, 1. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ ఆఫీసుల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ 2. ఆరోగ్యం.3. అరైవ్.. అలైవ్.4. సంక్షేమం.5. పిల్లల భద్రత.. డ్రగ్స్ కు అడ్డుకట్ట.6. రైతు సంక్షేమం.. వ్యవసాయం 7. విద్య 8. యువత.. క్రీడలు 9. మహిళలు 10. పర్యావరణం కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.మార్చి 6న అన్ని ఉమ్మడి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు నిర్వహించి, 99 రోజుల్లో శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించాను ఉన్నట్లు తెలియజేశారు.

## టీ20 ప్రపంచకప్‌పై యుద్ధ ప్రభావం

అమెరికా, ఇజ్రాయిల్-ఇరాన్ యుద్ధ ప్రభావం భారత్, శ్రీలంక దేశాల్లో జరుగుతున్న టీ20 ప్రపంచకప్ 2026పై పడింది. ఈ మెగా టోర్నీలో సూపర్-8 దశలో నిష్క్రమించిన వెస్టిండీస్ జట్టు.. అంతర్జాతీయ ఎయిర్‌స్పేస్ పరిమితుల కారణంగా భారత్‌లోనే చిక్కుకుపోయింది. అమెరికా, ఇజ్రాయిల్ దాడులకు ప్రతిగా ఇరాన్ పలు గల్ఫ్ ప్రాంతాలపై దాడులు చేస్తున్న నేపథ్యంలో ఆ ప్రాంతాల్లో విమాన సర్వీసులు నిలిచిపోయాయి. విండీస్ జట్టు స్వదేశానికి చేరాలంటే దుబాయ్ మీదుగా వెళ్లాల్సి ఉంది. అయితే యుద్ధ నేపథ్యంలో పరిస్థితులు అనుకూలించకపోవడంతో విండీస్ జట్టు భారత్‌లోనే హాల్ట్ అయ్యింది. ఈ విషయాన్ని విండీస్ క్రికెట్ బోర్డు ధృవీకరించింది. వీలైనంత త్వరగా తమ జట్టును స్వదేశానికి చేర్చే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ విషయంలో విండీస్ బోర్డుకు ఐసీసీ, బీసీసీఐ సహకరిస్తున్నాయి. మరోవైపు విండీస్‌లాగే మరో జట్టు కూడా భారత్‌లోనే ఇరుక్కుపోయింది. విండీస్‌లాగే సూపర్-8లోనే నిష్క్రమించిన జింబాబ్వే కూడా యుద్ధ ప్రభావం చేత విమాన రాకపోకలు నిలిచిపోవడంతో భారత్‌లో హాల్ట్ అయ్యింది. జింబాబ్వే కూడా స్వదేశానికి వెళ్లలంటే దుబాయ్ మీదుగా వెళ్లాల్సిందే. జింబాబ్వే పరిస్థితిని కూడా ఐసీసీ దగ్గరగా పర్యవేక్షిస్తుంది. వీలైనంత త్వరగా జింబాబ్వే జట్టును స్వదేశానికి పంపేందుకు ఏర్పాట్లు చేస్తుంది. ఇదిలా ఉంటే వెస్టిండీస్, జింబాబ్వే జట్లు ప్రపంచకప్‌లో సూపర్-8లోనే నిష్క్రమించాయి. ఈ రెండు జట్లు భారత్‌తో పాటు గ్రూప్-1లో ఉన్నాయి. ఈ గ్రూప్ నుంచి భారత్, సౌతాఫ్రికా సెమీస్‌కు చేరాయి. గ్రూప్-2 నుంచి ఇంగ్లండ్, న్యూజిలాండ్ ఫైనల్-4కు అర్హత సాధించాయి. తొలి సెమీఫైనల్లో సౌతాఫ్రికా, న్యూజిలాండ్.. రెండో సెమీఫైనల్లో భారత్-ఇంగ్లండ్ అమీతుమీ తేల్చుకుంటాయి. తొలి సెమీస్ కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా మార్చి 4వ తేదీ రాత్రి 7 గంటలకు ప్రారంభమవుతుంది. రెండో సెమీఫైనల్ ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా రాత్రి 7 గంటలకే మొదలవుతుంది.

# మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాత్ర మూర్తి మరణం

## మృత దేహానికి నివాళులు అర్పించిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు





**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుర్క జైపాల్ యాదవ్ మాతృమూర్తి గుర్క మంగమ్మ అనారోగ్యంతో మరణించడం జరిగింది విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్, గోలి శ్రీనివాసరెడ్డి, జూపల్లి భాస్కర్ రావు,కడ్తాలు మండల లోని చల్లంపల్లి గ్రామం లో వారి నివాసంలో మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ నీ ఓదార్చి మంగమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమం లో,మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్,మాజీ సర్పంచ్ లక్ష్మి నరసింహ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గంప వెంకటేష్, నాగులు నాయక్,రవి, వెంకటయ్య గౌడ్,తది తరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మరణించిన బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

### బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటా ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** వెల్దండ మండలం పరిధిలోని ఎన్నమ్స్ హాస్పిటల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒంటి గుండు తండాకు చెందిన వంకడావత్ గణేష్ మృతి చెందారు. సోమవారం ఉదయం తన స్వగ్రామానికి వస్తుండగా డీసీఎం వాహనం ఆయన బైక్‌ను ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.ఈ విషాద ఘటనపై సమాచారం అందుకున్న తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా ఆయన రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు నాగులు నాయక్ 3,000 వేల రూపాయలు అందజేశారు. మొత్తం 8,000 వేల రూపాయలు కుటుంబానికి అందించడం జరిగింది.బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, పిల్లల చదువుల విషయంలో ఎలాంటి అవసరం వచ్చినా తాను సహాయం చేస్తానని గోలి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వెల్దండ మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, గాన్ గట్టు తండా గ్రామ సర్పంచ్ లచ్చిరాం నాయక్, నారాయణపూర్ మాజీ సర్పంచ్ అంజి నాయక్, వార్డు సభ్యుడు ఆనంద్ తదితరులు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# విలువలు క్రమ శిక్షణను అలవర్చుకోవాలి

**సమస్యలను ధైర్యంగా స్వీకరించి విజయవంతం అవ్వాలి.**

**అగ్నిధారన్యూస్ హనుమకొండ** మంగళవారం హనుమకొండలోని రిజొనెన్స్ జూనియర్ కళాశాలలో హోలీ పండుగ సంబరాలు విద్యార్థులు, అధ్యాపకులు ఘనంగా ఉత్సాహభరితంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణం ఆనందోత్సాహాలతో రంగుల హర్షధ్వానాలతో కళాశాల ప్రాంగణమంతా మారుమ్రోగింది.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... హోలీ పండుగ కేవలం రంగుల పండుగ మాత్రమే కాకుండా, ఐక్యత, స్నేహభావం, ప్రేమ సానుకూలతను పంచే పండుగ అని తెలిపారు.విద్యార్థులు జీవితంలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా, వాటిని ధైర్యంగా స్వీకరించి విజయవంతంగా ముందుకు సాగాలని సూచించారు. చదువుతో పాటు మంచి విలువలు, పరస్పర గౌరవం క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు.హోలీ మనలోని చెడు ఆలోచనలు, అసూయలను దహనం చేసి, మంచి ఆలోచనలను అలవరచుకునే సందేశాన్ని ఇస్తుందని చెప్పారు. ప్రతి విద్యార్థి తమ లక్ష్యాలపై దృష్టి పెట్టి, తల్లిదండ్రులు గురువుల ఆశయాలను నెరవేర్చే విధంగా కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు లెక్కల మహేందర్ రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి, రగోతం రెడ్డి గోపాల్ రావు, కళాశాల ప్రిన్సిపాల్ మార్కెట్ ఎగ్జిక్యూట్ భూపాల్ గోలి కిషన్ రెడ్డి, పంది మహేందర్, ఏ మురళీకృష్ణ, విద్యాసాగర్, కొట్టే అశోక్, కుమార్ స్వామి, శ్రీరామరాజు,అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.




## మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాత్ర మూర్తి మరణం బాధాకరం

### మృత దేహానికి నివాళులు అర్పించిన విజిత రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుర్క జైపాల్ యాదవ్ మాతృమూర్తి గుర్క మంగమ్మ అనారోగ్యంతో మరణించడం జరిగింది విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కారులు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు విజిత రెడ్డి, కడ్తాలు మండల లోని చల్లంపల్లి గ్రామం లో వారి నివాసంలో మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ నీ ఓదార్చి మంగమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్ గౌడ్,మాజీ ఎంపీపీ, గోవర్ధన్,మాజీ సర్పంచ్,లక్ష్మీ నరసింహ రెడ్డి, అలీ, తది తరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాత్ర మూర్తి ఇక లేరు

### మృత దేహానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి




**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుర్క జైపాల్ యాదవ్ మాతృమూర్తి గుర్క మంగమ్మ అనారోగ్యంతో మరణించడం జరిగింది విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కడ్తాలు మండల లోని చల్లంపల్లి గ్రామం లోనీ వారి నివాసంలో మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ నీ ఓదార్చి మంగమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో,పొల్యూషన్ బోర్డు సభ్యులు బాలాజీ సింగ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్/గండీడ్:** ఈరోజు మహబూబ్ నగర్ జిల్లా గండీడ్ మండల కేంద్రంలో కొప్పుల మాసన్న ఆనారోగ్యంతో చనిపోవడం జరిగింది. గ్రూప్లో మెసేజ్ కి స్పందించి మానవత దృక్పథంతోనా స్పందించడం జరిగింది. మొత్తం జమ అయిన అమౌంటు 7100 రూపాయలు) బాధిత కుటుంబానికి ఇవ్వడం జరిగింది. గ్రామ ఉపసర్పంచ్ గుముడాల చెన్నయ్య,కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఎంపిటిసి కప్లాపూర్ ఆశన్న, మాజీ జడ్పీటీసీ జంగల్ల వెంకటయ్య, టీఎస్ యుటిఎఫ్ మహమ్మదాబాద్ మండల అధ్యక్షులు శెగ్గరి వెంకటయ్య,ఉమ్మడి పాలమూరు జిల్లా అంబేద్కర్ సంఘం అధ్యక్షులు పగిడ్యాల్ బోరు కృష్ణయ్య,సీనియర్ నాయకులు కొప్పుల శ్రీధర్, గండీడ్ మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు హాస్నాబాద్ వెంకటయ్య, ఎమ్మార్పీఎస్ మహమ్మదాబాద్ మండల అధ్యక్షులు దానకారి సురేష్, సీనియర్ నాయకులు కొండాపూర్ చెన్నప్ప, బొమ్మిరెడ్డి పల్లి మొగులన్న, నర్సింలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆకాశాన్ని చూస్తున్న చిన్నారులు గ్రహణాన్ని అర్థం చేసుకుంటున్న కొత్త తరం

### భయం కాదు-విజ్ఞానం నేర్చుకునే అవకాశమే చంద్రగ్రహణం

(ల గంగవరం రామకృష్ణారెడ్డి )



**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** ఆకాశంలో కనిపించే ప్రతి సహజ సంఘటన వెనుక ఒక శాస్త్రీయ కారణం ఉంటుంది. చంద్రగ్రహణం కూడా అలాంటి ఖగోళ అద్భుతమే. భూమి, సూర్యుడు, చంద్రుడు ఒకే సరళరేఖలో వచ్చినప్పుడు భూమి నీడ చంద్రుడిపై పడటంతో ఈ సంఘటన ఏర్పడుతుంది. ఇది సహజ ప్రక్రియ మాత్రమే గానీ అపశకునం కాదు. చిన్నారులు ఆసక్తిగా ఆకాశాన్ని వీక్షిస్తూ ప్రశ్నలు అడగడం సమాజంలో పెరుగుతున్న శాస్త్రీయ దృక్పథానికి సంకేతంగా భావించవచ్చు. గ్రహణం వంటి సంఘటనలను భయంతో కాకుండా విజ్ఞాన దృష్టితో చూడాల్సిన అవసరం ఉంది.మన సంస్కృతి,సాంప్రదాయాలు కాలక్రమేణా ఏర్పడ్డ నమ్మకాలు. పెద్దలు మంచి జరగాలని, చెడు దూరంగా ఉండాలని కొన్ని నియమాలు సూచించారు. ఆ ఉద్దేశాన్ని గౌరవించాలి. అయితే శాస్త్రం స్పష్టంగా చెప్పిన విషయాలను విస్మరించి అపోహలను ప్రోత్సహించడం సమాజానికి మేలు చేయదు.నేటి తరానికి భయం కాకుండా బుద్ధిని నేర్పాలి. ఆకాశాన్ని చూసి ప్రశ్నించడం, పరిశీలించడం, అర్థం చేసుకోవడం నేర్పితేనే విజ్ఞాన సమాజం నిర్మాణం సాధ్యమవుతుంది.చంద్రగ్రహణం వంటి సందర్భాలు విద్యార్థుల్లో శాస్త్రీయ చైతన్యాన్ని పెంపొందించేందుకు మంచి అవకాశాలుగా భావించవచ్చు. భయం కాదుడ బుద్ధి అవసరం.అపోహలు కాదు అవగాహన అవసరం.

# కార్పొరేట్ కు దీటుగా వైద్య సేవలు

**వైద్య సేవలలో దూసుకుపోతున్న పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి.**

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష చొరవ, ఎమ్మెల్యే విజయ రమణారావు సహకారం గొప్పవి.**

**వివరాలు వెల్లడించిన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్.**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి జిల్లా** ఒకప్పుడు ప్రభుత్వ దవఖానకు వెళ్లాలంటే ప్రజలు ప్రాణాలు అరిచేతుల్లో పెట్టుకుని వెళ్లేవారు. కారణం సరియైన వైద్య సౌకర్యాలు లేకపోవడం వైద్యులు అంతాగా పట్టించుకోకపోవడం, అటు వెళ్తే ఇంటికి వస్తామో రామో తెలవని పరిస్థితి, పేద మధ్యతరగతి ప్రజలు ప్రైవేట్ ధావఖానాల మెట్లకి వైద్యం చేయించుకోవాలంటే అందని ద్రాక్ష అని తెలిసిన విషయమే ఇంతకు ముందు మేముపోము బిడ్డో, సర్కార్ దవాఖానకు, అనే నానుడి నుండి నేడు, మేము వెళ్తే, పెద్దపల్లి సర్కార్ దవాఖానకె వెళ్తాం అనేంతగా మార్పు, ఇంత పెద్ద ఎత్తున వైద్యం కోసం ప్రజలు ఆస్పత్రికి వస్తున్నారంటే,ఈ మార్పు ఒక్కరోజులోనే జరగలేదు. రోజులు, నెలల, తరబడి నిరంతర కృషి ప్రజలకు ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కల్పించడం ద్వారా ఈ మార్పు సాధ్యమైంది. నేడు పేద,మధ్యతరగతి ప్రజలే కాదు, అత్యంత సంపన్నులు ఈ దావఖానాలో వైద్య సేవలు పొందుతున్నారు. ఇంత గొప్ప మార్పుకి,స్పందనకి ముఖ్య కారణం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ అని కచ్చితంగా చెప్పాలి. లాగే పెద్దపల్లి శాసన సభ్యులు చింతకుంట విజయ రమణ రావు సహాయ సహకారాలతో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ నిరంతర పర్యవేక్షణ వల్ల నేడు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి పెద్ద పెద్ద కార్పొరేట్ హాస్పిటల్స్ కు దీటుగా ఇక్కడి వైద్యులు, వైద్య సేవలు అందిస్తున్నారు. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి రోజు రోజుకి అధునాతన వైద్య సేవలతో ప్రజల్లోకి మారుమూల గ్రామాల్లోకి హాస్పటల్ ఖ్యాతి దూసుకుపోయింది. జిల్లా ప్రజల్లో నమ్మకం కలిగింది. అందుకే ఇంత పెద్ద మార్పు. గడిచిన ఫిబ్రవరి నెలలో ఆసుపత్రిలో నమోదు అయిన సేవల వివరాలు. మొత్తం 22447 మంది ఔట్ పేషెంట్లు ఆసుపత్రిలో వైద్య సేవలు పొందారు, ఇందులో 9758 మంది జనరల్ మెడిసిన్ విభాగంలో, 660 మంది జనరల్ సర్జరీ విభాగంలో, 4263 మంది చిన్న పిల్లల విభాగంలో, 3364 మంది గైనిక్ విభాగంలో, 410 మంది ఆర్థో విభాగంలో,



1509 మంది కంటి విభాగంలో, 675 మంది ఈ ఎన్ టి విభాగంలో, 1039 మంది చర్మ విభాగంలో మరియు 574 మంది దంత విభాగంలో వైద్య సేవలు పొందారు. అదే విధంగా 1872 మంది ఇన్ పేషెంట్లు గా వైద్య సేవలు పొందారు, ఇందులో 849 మంది జనరల్ మెడిసిన్ విభాగంలో, 50 మంది జనరల్ సర్జరీ విభాగంలో, 433 మంది చిన్న పిల్లల విభాగంలో, 273 గైనిక్ విభాగంలో, 90 మంది ఆర్థో విభాగంలో మరియు 174 మంది కంటి విభాగంలో ఇన్ పేషెంట్ వైద్య సేవలు పొందారు. వీటితో పాటు 54 ఆర్థో శస్త్ర చికిత్సలు, 81 జనరల్ సర్జరీ శస్త్ర చికిత్సలు, 164 కంటి శస్త్ర చికిత్సలు, 25 చెవి ముక్కు గొంతు శస్త్ర చికిత్సలు 409 డెంటల్ శస్త్ర చికిత్సలు అందినాయి. గడిచిన నెలలో మొత్తం 184 డెలివరీలు జరిగాయి. అదేవిధంగా 27859 ల్యాబ్ టెస్టులు, 2062 అల్ట్రా సౌండ్ స్కానింగ్, 133 టిఫ్ఫా స్కానింగ్, 722 ఈ సి జి, 255 2 డి ఎకో, 1880 ఎక్స్ రే, 724 ఫిజియో థెరపీ నవజాత శిశువులకు ఇప్పటి వరకు దాదాపుగా 700 మంది శిశువుల కి ట్రీట్మెంట్ చెయ్యడం జరిగింది. 308 ఆరోగ్య శ్రీ సేవలు అందించడం జరిగింది. వీటితో పాటు ప్రత్యేకంగా 8 లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సలు 1 యూరాలజీ శస్త్ర చికిత్స 9 రూట్ కెనాల్ శస్త్ర చికిత్సలు చేయడం జరిగింది. పెద్దపల్లి జిల్లా ప్రజలు పెద్దపల్లి ఆసుపత్రిలో అందుతున్న అన్ని రకాల వైద్య



సేవలు ఉపయోగించుకోవాలి అని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ మంగళవారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా సేవలలో రోగులకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే నేరుగా తనను సంప్రదించవచ్చు అని తెలిపారు.హాస్పిటల్ లో ఎక్కడైనా ఏదైనా సేవలలో ఇబ్బంది కలిగినా,లేదంటే పేషెంట్ సర్వీస్ గురించి ఏమైనా సలహాలు, సూచనలు ఉంటె ఇవ్వాలని ఆ ప్రకటనలో తెలిపారు.

## షాందూ పాషా మరణం చాలా బాధాకరం

**ఉప సర్పంచ్ నిజాం తో పాటు కుటుంబ సభ్యులకు పరామర్శ**

**మృత దేహానికి నివాళులు అర్పించిన పొల్యూషన్ బోర్డు సభ్యులు బాలాజీ సింగ్**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామ ఉప సర్పంచ్ నిజాం సర్కార్ తండ్రి షాందూ పాషా రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగింది.విషయం తెలుసుకున్న తెలంగాణ పొల్యూషన్ బోర్డు సభ్యులు బాలాజీ సింగ్ వారి నివాసానికి చేరుకొని పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, అకాల మరణం చాలా బాధాకరం. కుటుంబానికి అండగా ఉంటా మని అని తెలిపారు.ఈ కార్యక్రమంలో,నాయకులు తది తరులు పాల్గొన్నారు.గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి,మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ,సంతోష మల్లేష్, మార్చాల శ్రీనివాసులు, గౌస్, రహీం, తది తరులు పాల్గొన్నారు.

## ఆర్జీ3 ఓసీ1లో ఉత్సాహంగా హోలీ సంబరాలు

**గనిలో సంబరాలలోనైనా ఉత్పత్తిలోనైనా ఐక్యతతో అందరం ఒకటే.**

**-ఐఎన్టియుసి కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్**



**అగ్నిధారన్యూస్ గోదావరిఖని /8 ఇంక్లైన్ కాలనీ** సింగరేణి ఆర్జీ3 ఓసి1లో ఉద్యోగులు ఉత్సాహంగా హోలీ సంబరాలు చేసుకున్నారు. ఉదయం ఏడు గంటలకే రాత్రి బదిలి ఉద్యోగులు, మొదటి షిఫ్ట్ కు వచ్చిన ఉద్యోగులతో కలిసి సూపర్వైజర్లు, టెక్నీషియన్లు, అధికారులు ఒకరికొకరు రంగులు పూసుకొని, సంబరాలలో అందరం ఒక్కటేనని శు భాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఐఎన్టియుసి కేంద్ర కమిటీ కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ... సింగరేణిలో ఓసి1 ఉద్యోగులు రక్షణతో కూడిన ఉత్పత్తి సాధిస్తూ అన్నింట ఐక్యతతో ముందుంటారని, గని పరిస్థితుల దృష్ట్యా ఏరియా చిన్నదైనా త్వరలోనే అన్ని అనుమతులతో పూర్వ పరిస్థితికి చేరుకోవాలని ఇలాగే అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని గని ఆవరణలోని భద్రకాళి, మైసమ్మ అమ్మవార్లను వేడుకున్నారు. పిట్ సెక్రెటరీ తోకల ప్రవీణ్ రెడ్డి, గని మేనేజర్ రావుల పాపయ్య, అధికారులు బైరి రమేష్, కిషన్, కేవీ రమణారెడ్డి, ఎల్ వినాయక్, క్రాంతికుమార్, యూనియన్ నాయకులు కట్కూరి శ్రీనివాస్ రెడ్డి, ఎం.ప్రభాకర్ రెడ్డి, మామిడి సాంబయ్య, కల్వల రమేష్, కోలాని వెంకటరమణరెడ్డి, కొలిపాక సారయ్య, నరేష్ కుమార్, రాచర్ల వినయ్, రఘు, తిరుమలేశ్, రాజన్న, సతీష్, నర్సయ్య, సమ్మయ్య, కే.బుగ్గాజి, కుంట సత్యం ఈ సంబరాలలో పాల్గొన్నారు

## 98.44 శాతం రూ.2 వేల నోట్లు వెనక్కి

చలామణీలో ఉన్న 98.44 శాతం రూ.2 వేల నోట్లు తిరిగి బ్యాంకులకు చేరాయని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సోమవారం ప్రకటనలో వెల్లడించింది.ఈ ఏడాది ఫిబ్రవరి 28 నాటికి ఇంకా రూ.5,551 కోట్ల విలువైన పెద్ద నోట్లు ఇంకా ప్రజల వద్దే ఉన్నాయని తెలిపింది. 2023, మే 19న రూ. 2,000 నోట్ల ఉపసంహరణ ప్రకటన వెలువడే సమయానికి వ్యవస్థలో మొత్తం రూ. 3.56 లక్షల కోట్ల విలువైన నోట్లు ఉన్నాయి. ఈ నోట్లను ఆర్‌బీఐ చలామణి నుంచి ఉపసంహరించుకున్నప్పటికీ అవి చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయి. ఎవరి వద్దనైనా ఆ నోట్లు ఉంటే ఆర్‌బీఐ కార్యాలయాల్లో డిపాజిట్ చేయవచ్చు లేదా మార్చుకోవచ్చు. 2023, అక్టోబర్ 9వ తేదీ నుంచి ఆయా నోట్లను వ్యక్తులు, సంస్థలు ఆర్‌బీఐ ఆఫీసుల్లో అందజేస్తే, ఆ మొత్తాన్ని వారి అకౌంట్లలో డిపాజిట్ చేసే అవకాశం కల్పించింది. అదేవిధంగా దేశవ్యాప్తంగా ఉన్న పోస్టాఫీసుల నుంచి కూడా ప్రజలు తమ వద్ద రూ. 2,000 నోట్లను ఆర్‌బీఐకి పోస్టల్ రూపంలో పంపి, తమ అకౌంట్లలో క్రెడిట్ చేయించుకొనే వీలు కల్పించింది.

## ఇరాన్ దాడులతో అమెజాన్ క్లౌడ్ యూనిట్లలో అంతరాయం




పశ్చిమాసియా ప్రాంతంలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల కారణంగా అంతర్జాతీయ వాణిజ్య, వ్యాపార కార్యకలాపాల్లో గందరగోళం నెలకొంది. అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ ప్రతీకార దాడుల మధ్య గ్లోబల్ టెక్ దిగ్గజం అమెజాన్ క్లౌడ్ యూనిట్లలో సమస్యలు తెలత్తాయని వెల్లడించింది. ముఖ్యంగా బహ్రెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లోని అమెజాన్ క్లౌడ్ యూనిట్ డేటా సెంటర్లలో సోమవారం కనెక్టివిటీ సమస్యలు ఎదురయ్యాయని కంపెనీ తెలిపింది. ఇరాన్ దాడులు గల్ఫ్ వ్యాప్తంగా విమానాశ్రయాలు, ఓడరేవులు, నివాస ప్రాంతాలను తాకాయి. ఈ క్రమంలోనే తమ డేటా సెంటర్లను కూడా తాకడంతో మంటలు ఏర్పడ్డాయి. యూఏఈలోని క్లౌడ్ యూనిట్ ఏడబ్ల్యూఎస్ జోన్‌లలో ఒకదానికి పూర్తిగా విద్యుత్తు సౌకర్యం లేకుండా పోయింది. తర్వాత కొంత రికవరీ సాధించామని, అయినప్పటికీ అదనపు కనెక్టివిటీ సమస్యలు, ఎర్రర్ కొనసాగుతోందని అమెజాన్ వివరించింది. దీనికి సంబంధించి దర్యాప్తు చేస్తున్నందున కస్టమర్లు ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని సిఫార్సు చేసింది. అలాగే, కంపెనీకి చెందిన బహ్రెయిన్ డేటా సెంటర్‌లో కూడా కనెక్టివిటీ సమస్యలు నెలకొన్నాయని సమాచారం. దీనిపై కంపెనీ స్పష్టమైన వివరాలు వెల్లడించలేదు.

## ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఖర్జూర పండ్లు పంపిణీ





**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి నియోజక వర్గంలోని కడ్తల్, తలకొండపల్లి, మండలం లోని అన్ని గ్రామాలలో పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో నియోజక వర్గంలో నీ మండలాల మరియు గ్రామాల ముస్లిం సోదరులకు కుటుంబ సభ్యులకు ఖర్జూర పండ్లు పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రంజాన్ మాసంలో ఖర్జూర పండ్లు పంపిణీ చేయడం జరుగుతుంది అని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తది తరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య

**అగ్నిధారన్యూస్ గోదావరిఖని** గోదావరిఖని పట్టణంలోని జీఎం కాలనీలో మంగళవారం విషాద ఘటన చోటుచేసుకుంది. మిగన బోయిన భార్గవ్ (28) అనే యువకుడు ఇంట్లో ఇనుప రాడుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి మిగనబోయిన స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు, భార్గవ్ తండ్రి గణేష్‌కు సంబంధించిన వివరాల ప్రకారం గతంలో తన అన్నయ్య మృతి చెందడంతో, అతని స్థానంలో భార్గవ్‌కు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్లో ఉద్యోగం లభించింది. అయితే గత రెండు సంవత్సరాలుగా బావిలో (అండర్‌గ్రౌండ్) విధులు నిర్వహించలేని పరిస్థితి ఉండటంతో ఇంటి వద్దనే ఉంటూ కుటుంబ పోషణ కోసం అప్పులు చేయాల్సి వచ్చిందని తెలిపారు.క్రమంగా ఆ అప్పులు తీర్చలేని స్థితి రావడంతో తీవ్ర ఆర్థిక ఒత్తిడికి లోనైన భార్గవ్ ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది.ఈ ఘటనపై మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు గోదావరిఖని 1టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.ఈ కేసును ఎస్.ఐ. పి. రాజయ్య పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**తలకొండ పల్లి మండల కేంద్రంలోనీ అన్ని గ్రామాలలో తలకొండపల్లి మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు.ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది.అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు పంచి పెట్టుకొని ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. సొంత గ్రామం పడకల్ లో కేక్ కట్ చేసి టపాకాయలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోకూరి ప్రభాకర్ రెడ్డి ఎప్పుడు ప్రజాసేవలో ముందు ఉంటాడని పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం పనిచేయడం జరుగుతుంది అని ప్రజా సేవకుడు




అన్నారు. ఈ కార్యక్రమంలో ,అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్,మరియు ఎన్ ఎస్ యు ఐ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గోదావరి పుష్కర ఘాట్‌లను సందర్శించిన పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డి

**అగ్నిధారన్యూస్ గోదావరిఖని** మంగళవారం రోజున రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధి పెద్దపల్లి జోన్, గోదావరిఖని సబ్ డివిజన్ అంతర్గం పోలీస్ స్టేషన్ పరిధి ఎల్లంపల్లి ప్రాజెక్ట్, గోలివాడ, గోదావరిఖని 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి గోదావరి బ్రిడ్జ్ సమీపంలోని గోదావరి పుష్కర ఘాట్‌లను పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డి ప్రత్యక్షంగా సందర్శించి గోదావరి తీర ప్రాంతాల్లో పుష్కరాలు ఏర్పాట కోసం తీసుకుంటున్న చర్యల ఏర్పాట్ల పై పూర్తిస్థాయి కార్యచరణ రూపొందించాలని పలు సూచనలు చేశారు.గోదావరి తీరంలో అధిక సంఖ్యలో భక్తులు పుష్కర స్నానాలు ఆచరించే అవకాశం ఉందని ఘాట్‌ల వద్ద భక్తుల రాకపోకలు, భద్రతా ఏర్పాట్లు, బ్యారికేడింగ్, సీసీ కెమెరాల పనితీరు, లైటింగ్ సౌకర్యం, పార్కింగ్ ఏర్పాట్లు, ట్రాఫిక్ మళ్లింపులు వంటి అంశాలను డీసీపీసవివరంగాపరిశీలించారు.ప్రత్యేకించి మహిళలు, వృద్ధులు, చిన్నారులు పుష్కర స్నానాల సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా, అత్యవసర పరిస్థితుల కోసం కంట్రోల్ రూమ్,



ఘాట్ పరిసరాల్లో శుభ్రత, భక్తులు సురక్షితంగా, ప్రశాంత వాతావరణంలో పుష్కర ఘాట్‌లనువినియోగించుకునేలా అన్ని శాఖల సమన్వయం తో సమగ్ర ప్రణాళిక రూపొందించి పని చేయాలని అధికారులకు డీసీపీస్పష్టం చేశారు.డీసీపీ వెంట గోదావరిఖని ఏసీపీ రమేష్,రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాద్ రావు, అంతర్గం ఎస్ఐ వెంకట్ పాల్గొన్నారు.

## పాలకుర్తిలో ఘనంగా హోలీ సంబరాలు

**అగ్ని ధార న్యూస్ ,(పాలకుర్తి):** మండల కేంద్రంలో హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కందుల సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరై వేడుకలకు రంగులద్దారు.మండల అధ్యక్షుడు మెరుగు నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంబరాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రంగుల ఆటలు, శుభాకాంక్షల మార్పిడి మధ్య హోలీ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ హోలీ వంటి పండుగలు సమాజంలో సఖ్యత, సౌభ్రాతృత్వం, ఐక్యతను పెంపొందించేందుకు దోహదపడతా యని పేర్కొన్నారు. కార్యకర్తలకు రంగులు పూసి హోలీ శుభా



కాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో పరికిపండ్ల రామ్, జట్పట్ తిరుపతి, గండికోట కుమార్, కన్నం వెంకటేష్, లక్ష్మణ్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.


అగ్నిధార

# కేబీఆర్ పార్క్ చుట్టూ ట్రాఫిక్ కష్టాలు

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాలైన బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ పరిసరాల్లో ట్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయి. కేబీఆర్ పార్క్ వద్ద స్టీల్ ఫ్లైఓవర్ , అండర్‌పాస్ నిర్మాణానికి సంబంధించి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తవ్వకం పనులను ప్రారంభించింది. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులో భాగంగా ఈ పనులను చేపడుతున్నారుప్రస్తుతం బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2 పార్క్ హయత్ సమీపంలో భారీ యంత్రాలతో తవ్వకాలు జరుగుతున్నాయి. నిర్మాణ ప్రాంతానికి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో ప్రధాన రహదారి ఇరుకుగా మారింది. మట్టి పరీక్షలు పూర్తయ్యాయని, త్వరలోనే పిల్లర్ల నిర్మాణ పనులు చేపడతామని జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు వెల్లడించారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, కేబీఆర్ పార్క్ ఎంట్రన్స్, ముగ్ధ జంక్షన్ల వద్ద ఈ పనులు కొనసాగనున్నాయి. ఈ ప్రాంతంలో స్టార్ హోటళ్లు, ఆసుపత్రులు, వాణిజ్య సంస్థలు ఎక్కువగా ఉండటంతో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా ఉదయం 9 నుండి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుండి రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్ రద్దీ తీవ్రంగా ఉండనుంది. పనులు వేగం పుంజుకుంటే ట్రాఫిక్ నిలిచిపోయే ప్రమాదం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ట్రాఫిక్ పోలీసులు ఇప్పటికే ప్రత్యామ్నాయ మార్గాలపై అడ్వైజరీ జారీ చేశారు:

ఔఈఅఒ నుండి జూబ్లీహిల్స్/కేబుల్ బ్రిడ్జ్ వైపు వెళ్లేవారు: శ్రీనగర్ కాలనీ టీ-జంక్షన్, సాగర్ సొసైటీ వద్ద మళ్లింపు ఉంటుంది. వీరు శ్రీనగర్ కాలనీ మెయిన్ రోడ్ ? ఇందిరానగర్ లేబర్ అడ్డా ? రోడ్ నెం. 5 జూబ్లీహిల్స్ ? వెంకటగిరి ఎక్స్ రోడ్స్ మీదుగా ప్రయాణించాలి.రోడ్ నెం. 36 ఠ 45 నుండి ఔఈఅఒ వైపు వచ్చేవారు: జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వెంకటగిరి రోడ్ నెం. 2 యూసుఫ్‌గూడ బస్తీ ? మైత్రీవనం అమీర్‌పేట మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.పంజాగుట్ట నుండి కేబీఆర్ పార్క్/రోడ్ నెం. 36 వైపు వెళ్లేవారు: బంజారాహిల్స్ రోడ్ నెం. 10 క్యాన్సర్ హాస్పిటల్ అగ్రసేన్ ఐలాండ్ భారతీయ విద్యాభవన్ ? రోడ్ నెం. 45 మీదుగా వెళ్లాలి. మాసబ్ ట్యాంక్ నుండి జూబ్లీహిల్స్ వైపు వెళ్లేవారు: విరించి హాస్పిటల్ వద్ద ఎడమకు తిరిగి అగ్రసేన్ ఐలాండ్ భారతీయ విద్యాభవన్ మీదుగా ప్రయాణించాలి. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు వాహనదారులు సహకరించాలని, సాధ్యమైనంత వరకు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని అధికారులు కోరుతున్నారు.




# రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వింతవింత రాజకీయ చేష్టలకు పాల్పడుతోంది

**హైదరాబాద్ :** గత మూడు నాలుగు రోజులుగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వింతవింత రాజకీయ చేష్టలకు పాల్పడుతోంది. అధికారంలోకి వచ్చి 26 నెలలు కావొస్తున్నా, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో మాత్రం పూర్తిగా విఫలమైందని బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్ విమర్శించారు. మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయం లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 6 గ్యారంటీలు సహా అన్ని హామీలు అమలు చేస్తామని గొప్పగా ప్రకటించారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారు. ప్రజలు ఇప్పుడు "ఎందుకు కాంగ్రెస్‌కు ఓటేశాం?" అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మూసీ పునరుజ్జీవన పేరుతో, గాంధీ సరోవర్ ప్రాజెక్టు పేరిట ప్రజల భూములపై కాంగ్రెస్ ప్రభుత్వం కన్నేసింది. మూసీ, ఈసా నదులు కలిసే ప్రాంతానికి సమీపంలో ఉన్న ప్రైవేట్ వ్యక్తుల భూములను అగ్గువ ధరలకు స్వాధీనం చేసుకుని కాంట్రాక్టర్లకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందన్నారు. తరతరాలుగా వారసత్వంగా వచ్చిన ఖరీదైన పట్టా భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తోందని ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపాదిత గాంధీ సరోవర్‌కు దూరంగా ఉన్న భూములను కూడా కాజేసే ప్రయత్నం జరుగుతోందని మూసీ రివర్ ఫ్రంట్ విషయంలో ప్రభుత్వం ఇప్పుడు రకరకాల ప్రకటనలు చేస్తోంది. కానీ ఇదే ప్రాంతాల్లో గతంలో అధికారంలో ఉన్నప్పుడు అపార్ట్‌మెంట్లకు అనుమతులు ఇచ్చింది. ఇప్పుడు అన్ని పర్మిషన్లు ఉన్న పేదల ఇళ్లను కూల్చివేయడం అన్యాయం. కొందరు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ గారిని, రేవంత్ రెడ్డిని పోలుస్తూ చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు.. యూపీలో బుల్డోజర్ చర్యలు ప్రభుత్వ భూములను ఆక్రమించినవారిపై, మాఫియా, క్రిమినల్ ఎలిమెంట్స్‌పై మాత్రమే జరుగుతున్నాయి. యోగి ఆదిత్యనాథ్ గారు ప్రజా హక్కులను కాపాడుతూ, నేరస్తులపై, ఇల్లీగల్ ట్రక్చర్స్‌పై మాత్రమే బుల్డోజర్లను ఉపయోగిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపైనే చర్యలు తీసుకుంటున్నారు. కానీ తెలంగాణలో మాత్రం లీగల్ నిర్మాణాలపైనా, పేదల ఇండ్లను కూల్చుతూ గడ్డపార ప్రభుత్వంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. కేరళలో ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ నుంచి గాంధీ కుటుంబానికి వెయ్యి కోట్లు పంపాలంటూ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం దారుణం. తెలంగాణలో ప్రజలు ఆత్మహత్యలు? కాంగ్రెస్ మాత్రం వసూళ్ల వైద్యం చేయించుకోలేక, రిటైర్మెంట్ డబ్బులు రాక, అప్పుల భారం తట్టుకోలేక ప్రజలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సీఎం "రూ.1000 కోట్లు" అంటున్నారు. ఇంత దారుణం మరెక్కడాలేదు. సీఎం రేవంత్ రెడ్డి "రాహుల్ గాంధీని ప్రధాని చేస్తామని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది. కాబట్టి రేవంత్ ఆశ నెరవేరదనే విషయం గుర్తుంచుకోవాలి. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కనుమరుగవుతోంది. కేవలం కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే అధికారంలో ఉంది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పరిస్థితి దిగజారింది. ప్రస్తుతం కొన్ని రాష్ట్రాలకు మాత్రమే పరిమితమై ఉంది. కర్ణాటకలో కిస్సా కుర్చీకా అనే మాదిరిగా సీఎం, డిప్యూటీ సీఎం మధ్య కుర్చీ కొట్లాట జరుగుతోంది. అధికార పోరు, అంతర్గత విభేదాలు బహిరంగంగానే కనిపిస్తున్నాయి. ఇటు తెలంగాణలో ఖమ్మం బ్యాచ్, మరోవైపు నల్లగొండ బ్యాచ్ రేవంత్ రెడ్డి నేతలు ఎవరు పెట్టి ఎప్పుడు సీఎం అవుదామా అని ఎదురుచూస్తున్నారు. ఇలా కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు స్పష్టంగా కనిపిస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ ప్రధాని దేశ ప్రజలలో గొప్ప విశ్వాసాన్ని పొందారు. ప్రపంచ దేశాలు కూడా ఆయనను స్ట్రాంగ్ లీడర్‌గా చూస్తున్నాయి. దేశంలో సుపరిపాలన, అభివృద్ధి, భద్రత అందించడం ఆయనకే సాధ్యమైంది. ఈ క్రమంలో వరుసగా మూడుసార్లు ప్రధానమంత్రి అయ్యారు. మోదీ ప్రభుత్వంలో దేశం అభివృద్ధిలో దూసుకెళ్తోంది. అందుకే 2047 వరకు దేశ ప్రజల విశ్వాసంతో ప్రధానమంత్రి పదవి బలంగా కొనసాగుతుంది. 2047 వరకు ప్రధానమంత్రి సీటు ఖాళీ లేదు. కాని సీఎం రేవంత్ రెడ్డి ఒక విషయం స్పష్టంగా గుర్తుంచుకోవాలి. వైఫల్యాలతో, ఫెయిల్యూర్ పాలనతో, గడ్డపార పాలనతో తెలంగాణ రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నందుకు ప్రజలు తగిన సమాధానం చెప్పే రోజు దూరంలో లేదు. 2028లో మార్పు ఖాయం. భారతీయ జనతా పార్టీ విజయం సాధిస్తుంది. బీజేపీ అభ్యర్థే తెలంగాణ ముఖ్యమంత్రి అవుతారు. రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటనకు వచ్చి ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఢిల్లీకి వెళ్లిపోయారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదు.× ఎన్నికల ముందు అశోక్‌నగర్ కు వచ్చిన రాహుల్ గాంధీ నిరుద్యోగులతో సమావేశమై రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాని ఆ హామీని నెరవేర్చలేదు. రాహుల్ గాంధీకి, అదే నిరుద్యోగుల ముందుకు వెళ్లే ధైర్యం ఉందా? అందుకే ప్రజలకు మొహం చూపించే ధైర్యంలేక తోకముడిచారు.× అబద్ధాలతో రాజ్యాంగాన్ని పదేపదే అవమానపరుస్తూ, రాజ్యాంగ వ్యవస్థలను, ఎన్నికల కమిషన్ ను అవమాన పర్చేలా, కించపర్చేలా మాట్లాడుతున్న రాహుల్ గాంధీకి అర్హత లేదు. గ్యారంటీలు, హామీలు నెరవేర్చలేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సీఎం కుర్చీని కాపాడుకునేందుకు... రాహుల్ గాంధీని పొగడ్తలతో ముంచెత్తి భజన చేస్తున్నారని ఎద్దేవా చేశారు.. 150 డివిజన్లు ఉన్న జీహెచ్ఎంసీని 300 డివిజన్లుగా విభజించి, ఒక్క కార్పొరేషన్‌ను అశాస్త్రీయంగా మూడు ముక్కలుగా చేయడం వెనుక భారతీయ జనతా పార్టీని రాజకీయంగా దెబ్బతీయాలనే అక్కసే కారణం. ఉదాహరణకు... బిల్డింగ్ పర్మిషన్ ఇవ్వేది ఒక కార్పొరేషన్ లో అయితే.. ఎన్ వోసీ తీసుకోవాలంటే కార్పొరేషన్ కు లేదా మరోపోటుకు వెళ్లాల్సివస్తోంది. ఇది దుస్థితి. హైదరాబాద్ కోర్ సిటీని మజ్లిస్ పార్టీకి అప్పగించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్ సర్కారులో నగర పాలన పూర్తిగా గాడి తప్పింది. హైదరాబాద్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తీవ్రమయ్యాయి. చెత్త నిర్వహణ దారుణంగా ఉంది, తాగునీటి కొరత, రోడ్ల దుస్థితి, డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నం, ట్రాఫిక్ అస్తవ్యస్త పరిస్థితి?ఇవన్నీ ప్రభుత్వ వైఫల్యాలను స్పష్టంగా చూపిస్తున్నాయి జీహెచ్ఎంసీ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం తగిన నిధులు కేటాయించలేదు. మౌలిక సదుపాయాలపై సరైన శ్రద్ధ లేదు. పారిశుద్ధ్యం, రోడ్లు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఫలితంగా హైదరాబాద్ నగరం అభివృద్ధి పరంగా వెనుకబడుతోంది. కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీ ... పథకం కింద తెలంగాణ పురపాలక శాఖకు రూ.650 కోట్ల వడ్డీలేని రుణాన్ని మంజూరు చేసిందని తెలిపారు. ఇది గత పదేళ్లలో రాష్ట్రానికి అందిన అత్యంత పెద్ద మొత్తాల్లో ఒకటి. ఈ మూలధన పెట్టుబడి నిధులు మునిసిపాలిటీల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, రోడ్లు, పట్టణీకరణ, జియో ట్యాగింగ్, ఆస్తి పన్నుల డిజిటలైజేషన్, మాస్టర్ ప్లాన్ రూపకల్పన వంటి సమగ్ర సంస్కరణలకు వినియోగించేందుకు ఉద్దేశించబడ్డాయన్నారు. 50 ఏళ్ల కాలపరిమితితో, వడ్డీలేమి లేకుండా ఈ రుణం ఇవ్వడం ద్వారా కేంద్రం తెలంగాణ పట్టణాభివృద్ధికి విశ్వసనీయ మద్దతు అందిస్తోందన్నారు.. మొదటి దశలో రూ.650 కోట్లు విడుదల కాగా, సరైన వినియోగం ఆధారంగా త్వరలో మరో రూ.250 కోట్లు అందే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఓవైపు తెలంగాణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుంటే.. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం విభిన్నంగా వ్యవహరిస్తోంది. జీహెచ్ఎంసీని అవ్యవస్థీకంగా మూడు ముక్కలుగా విభజించడం ద్వారా వ్యవస్థలను బలహీనపరుస్తోంది. ఇది ప్రజలకు తీరని అన్యాయం మాత్రమే కాకుండా, కేంద్రం ఇచ్చిన నిధుల సద్వినియోగానికి కూడా పెద్ద అడ్డంకిగా మారే ప్రమాదం ఉందన్నారు.. ఈ మీడియా సమావేశంలో బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు , బిజెపి సోషల్ మీడియా స్టేట్ కన్వీనర్ సుమిరన్ తదితరులు పాల్గొన్నారు.




## జిల్లాలో షీ టీమ్స్తో మహిళలు, బాలికలకు భద్రత

**మహబూబ్‌నగర్ :** జిల్లాలో మహిళలు, బాలికలు, విద్యార్థినులకు సంపూర్ణ భద్రత కల్పించేందుకు ×షీ టీమ్స్× బృందాలు నిరంతరం కృషి చేస్తున్నాయని జిల్లా ఎస్పీ డి.జానకి, ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాసంస్థలు, బస్సు స్టేషన్లు, రైల్వే స్టేషన్లు మరియు ఇతర రద్దీ ప్రదేశాలలో షీ టీమ్స్ సిబ్బంది సివిల్ డ్రెస్లో నిత్యం నిఘా నిర్వహిస్తున్నారని తెలిపారు. ×ఫిబ్రవరి× నెలలో జిల్లాలో మహిళలు, విద్యార్థినులను వేధిస్తున్న పోకిరీలపై కఠిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మొత్తం 20 ఫిర్యాదులు అందగా, అందులో 4 కేసుల్లో కౌన్సెలింగ్ నిర్వహించగా, 14 మందిని రెడ్ హ్యాండెడ్గా పట్టుకుని చర్యలు తీసుకున్నామని, 2 ఎఫ్ఐఆర్లు నమోదు చేయడంతో పాటు 6 ఈ-పెట్టీ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే 12 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, జిల్లాలోని 70 హాట్స్పాట్ ప్రాంతాలను సందర్శించి నిఘా నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలు, ప్రభుత్వ పాఠశాలలు, తెలంగాణ మోడల్ స్కూళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలల్లో షీ టీమ్స్ బృందాలు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో చట్టం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ తదితర అంశాలపై నిరంతరం అవగాహన కల్పిస్తున్నాయని ఎస్పీ గారు తెలిపారు. బాలికలు, విద్యార్థినులు తమపై ఎలాంటి వేధింపులు జరిగినా భయపడకుండా వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళల రక్షణ కోసం తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేకంగా షీ టీమ్స్ ఏర్పాటు చేయబడిందని, మహిళలు మరియు బాలికల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఎవరైనా రోడ్డుపై అవహేళనగా మాట్లాడినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా, వేధింపులకు పాల్పడినా వెంటనే డయల్ 100 లేదా జిల్లా షీ టీమ్ నెంబర్ 8712659365 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యార్థినులు మరియు మహిళలు తమ విద్యపై దృష్టి సారించి భవిష్యత్తును నిర్మించుకోవాలని, ప్రతి ఒక్కరి రక్షణ కోసం షీ టీమ్స్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని ఎస్పీ గారు తెలిపారు. విద్యాసంస్థల వద్ద మరియు రద్దీ ప్రదేశాలలో షీ టీమ్స్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తున్నారని తెలిపారు.

## ఖోమ్ నగరానికి భారతీయ విద్యార్థుల తరలింపు

**హైదరాబాద్ :** ఇరాన్‌లో నెలకొన్న యుద్ధ వాతావరణం, వరుస వైమానిక దాడుల నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న భారతీయ విద్యార్థుల భద్రతపై కేంద్రం కీలక చర్యలు చేపట్టింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో పరిస్థితులు ఆందోళనకరంగా మారడంతో, అక్కడి విద్యార్థులను సురక్షిత ప్రాంతమైన ఖోమ్ నగరానికి తరలించినట్లు జమ్మూ కాశ్మీర్ స్టూడెంట్స్ అసోసియేషన్ (జేకేఎస్ఏ) మంగళవారం వెల్లడించింది.అసోసియేషన్ నేషనల్ కన్వీనర్ నాసిర్ ఖుహామీ ఈ విషయంపై మాట్లాడుతూ.. టెహ్రాన్‌లో భద్రతా పరిస్థితులు క్షీణిస్తున్నాయని, అందుకే ముందుజాగ్రత్త చర్యగా భారత ఎంబసీ అధికారులే స్వయంగా రంగంలోకి దిగారని తెలిపారు. ఎంబసీ ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో విద్యార్థులను టెహ్రాన్ నుంచి ఖోమ్‌కు తరలించారని, ప్రస్తుతం వారంతా అధికారుల పర్యవేక్షణలో సురక్షితంగా ఉన్నారని స్పష్టం చేశారు. జమ్మూ కాశ్మీర్‌కు చెందిన విద్యార్థులతో పాటు ఇతర రాష్ట్రాల విద్యార్థులు కూడా ఇందులో ఉన్నట్లు సమాచారం.విద్యార్థులతో తమ అసోసియేషన్ నిరంతరం టచ్‌లో ఉందని, వారంతా క్షేమంగా ఉన్నారని నాసిర్ తెలిపారు. అక్కడ పరిస్థితులు ఉద్రిక్తంగా ఉండటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందడం సహజమని, అయితే విద్యార్థులను సురక్షిత ప్రాంతానికి మార్చడం ద్వారా వారి కుటుంబాలకు కొంత ఊరట లభించిందని అన్నారు. భారత విదేశాంగ శాఖ, టెహ్రాన్‌లోని భారత ఎంబసీ అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాయని వెల్లడించారు. త్వరలోనే విద్యార్థులను భారత్‌కు రప్పించే అవకాశాలు ఉన్నాయని, ఇరాన్ గగనతలం తిరిగి తెరుచుకోగానే దీనిపై తదుపరి చర్యలు ఉంటాయని నాసిర్ పేర్కొన్నారు. క్లిష్ట సమయంలో భారత ఎంబసీ అధికారులు వేగంగా స్పందించి, విద్యార్థులకు అండగా నిలవడంపై అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపింది. తల్లిదండ్రులు ధైర్యంగా ఉండాలని, కేంద్రం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని భరోసా ఇచ్చింది.

## మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు అడుగడుగునా ఆటంకాలు

**హైదరాబాద్ :** తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. మూసీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న జనాలను బలవంతంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఖాళీ చేయిస్తోందని.. ఇప్పటికే స్థానికులు, ప్రతిపక్షాలు తీవ్ర ఆరోపణలు చేశాయి. అదే సమయంలో మూసీ ఒడ్డున గాంధీ సరోవర్ ప్రాజెక్టులో భాగంగా భారీ మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారని.. దానికోసం భారీగా అక్కడ కూల్చివేతలు జరుగుతున్నాయని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా మరో అంశం తెరపైకి వచ్చింది. మూసీ నది ఒడ్డున ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా.. భారీగా చెట్లను నరికివేస్తున్నారంటూ ప్రముఖ మానవ హక్కుల లాయర్ ఇమ్మనేని రామారావు.. నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ)ను ఆశ్రయించారు.మూసీ నది అభివృద్ధి కోసం రేవంత్ సర్కార్ చేపట్టిన మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో లాయర్ ఇమ్మనేని రామారావు కేసు నమోదు చేశారు. మూసీ ప్రాజెక్టు పేరు చెప్పి.. ఆ నది చుట్టుపక్కల పర్యావరణ విధ్వంసం జరుగుతోందని.. దీన్ని అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. మూసీ పరివాహకంలో ఉన్న లంగర్ హౌస్, నార్సింగి, రాందేవ్‌గూడ ప్రాంతాల్లో ఎలాంటి సమగ్ర అధ్యయనం లేకుండానే.. ఎప్పటి నుంచో ఉన్న వేలాది మహా వృక్షాలను నరికేస్తున్నారని ఫిర్యాదులో వెల్లడించారు. చెట్లను తొలగించడం వల్ల పర్యావరణ, సామాజిక ప్రభావంపై ఎలాంటి సోషల్ ఇంపాక్ట్ స్టడీ చేపట్టకుండానే ప్రభుత్వం పనులు ప్రారంభించిందని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు.మూసీ నది తీరాన్ని తీవ్రంగా ధ్వంసం చేస్తున్నారని.. దాని వల్ల ప్రజల జీవనాధారంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే చెట్ల నరికివేతను వెంటనే ఆపాలని.. ప్రాజెక్ట్ అమలు సంస్థ అయిన మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఈవీ నరసింహా రెడ్డికి ఆదేశాలు జారీ చేయాలని ఎన్‌హెచ్ఆర్సీని లాయర్ ఇమ్మనేని రామారావు కోరారు. అదే సమయంలో పర్యావరణానికి హాని చేసే పనులను ఆపేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.అలాగే ఈ మూసీ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ కారణంగా ప్రభావితం అయ్యే కుటుంబాలకు తగిన పరిహారం అందించాలని పేర్కొన్నారు. లాయర్ ఇమ్మనేని రామారావు చేసిన ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న హెచ్ఎచ్ఆర్సీ.. కేసు నమోదు చేసి దర్యాప్తును మొదలుపెట్టింది. పర్యావరణాన్ని నాశనం చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని పేర్కొన్న ఇమ్మనేని రామారావు.. మూసీ తీరాన్ని రక్షించేందుకు చట్టపరంగా తమ పోరాటం కొనసాగుతుందని తేల్చి చెప్పారు.

## విద్యార్థిని వేధించవు కేసులో యువకుడి అరెస్టు

**కుత్బుల్లాపూర్ :** బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిఆర్ విజ్ఞాన జ్యోతి కళాశాలలో మూడవ సంవత్సరం బీటెక్ విద్యార్థినిపై ఇద్దరు యువకులు వేధింపులు, అఘాయిత్యానికి పాల్పడ్డారనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి.. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు, ఆసిస్ అనే విద్యార్థి గత ఒక సంవత్సరం నుంచి తన కుమార్తెను వేధిస్తున్నాడని పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు ఆసిస్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ప్రవీణ్ అనే మరో యువకుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలు, నిందితులు బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులే కావడం గమనార్హం. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు బాచుపల్లి పోలీసులు తెలిపారు.

## బోసి పోయిన శంషాబాద్ విమానాశ్రయం


**రంగారెడ్డి :** పశ్చిమాసియాదేశాల్లోకొనసాగుతున్నయుద్ధ ప్రభావం అంతర్జాతీయ విమాన రాకపోకలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. యుద్ధం మొదలైన గతనాలుగురోజులుగా శంషాబాద్ విమానాశ్రయానికి రాకపోకలు సాగించే పలు విమానాలు పెద్ద ఎత్తున అవుతుండడంతో శంషాబాద్ ఎయిర్పోర్టులో ప్రయాణికులు లేక ఎయిర్పోర్ట్ బోసిపోయింది. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుండి సగటున 42 నుండి 48 విమానాలు ప్రతిరోజు అంతర్జాతీయ గమ్యస్థానాలను రాకపోకలు కొనసాగిస్తుంటాయి. ఇందులో ప్రధానంగా గల్ఫ్,దేశాలకుఅత్యధికంగా28సర్వీసులు రాకపోకలు సాగిస్తుంటాయి. యుద్ధ ప్రభావం నుండి ప్రతిరోజు 20 నుండి 25 వరకు అరైవల్,డిపార్చర్,విమానాలు రద్దు అవుతున్నాయి. సుమారు40విమానం ప్రయాణికులు రాకపోకలుశంషాబాద్ ఎయిర్పోర్ట్ నుంచి నిలిచిపోయాయి. వివిధ విమాన సంస్థల టికెట్లు కౌంటర్ల వద్ద ఎవరు కనిపించకపోవడంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. శంషాబాద్ ఎయిర్పోర్ట్ అంతర్జాతీయ విమానాశ్రయం ఇమిగ్రేషన్ చెకింగ్ 10,11 గేట్ల వద్ద జనాలు లేక నిర్మానుష్యంగా కనిపిస్తుంది.

## మియాపూర్ మక్తలో విషాదం: ప్రేమ వ్యవహారంతో యువతి ఆత్మహత్య

**హైదరాబాద్ :** మియాపూర్ మక్త ప్రాంతంలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. 20 ఏళ్ల యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. మెదక్ జిల్లా నారాయణఖేడ్ గ్రామానికి చెందిన యువతి సోను భాయ్, మియాపూర్ మక్తలోని ఫస్ట్ హెల్త్ ల్యాబ్స్ పనిచేస్తూ, అక్కడే అద్దెకు తీసుకున్న 2 ఇంటి ఫ్లాట్లో నివాసం ఉంటున్నట్లు సమాచారం. గత కొంతకాలంగా ప్రేమ వ్యవహారం కొనసాగుతున్న నేపథ్యంలో, నిన్న రాత్రి ఆమె నివాసం ఉంటున్న అద్దె ఇంట్లో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. సహచరులు గుర్తించి వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య

**యాదాద్రి భువనగిరి :** కుటుంబ కలహాలు మరో ఇంటిని చిదిమేశాయి. ఇద్దరు పిల్లల్ని చంపి, ఓ తల్లి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీ నగర్ మండలంలోని గొల్లగూడెం గ్రామంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గొల్లగూడెం గ్రామానికి చెందిన మేకల మహేశ్ యాదవ్, ఐశ్వర్య దంపతుల మధ్య కొంతకాలంగా విభేదాలు కొనసాగుతున్నాయి. దీంతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఐశ్వర్య తన ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లింది. సోమవారం నాడు ఐశ్వర్య కుటుంబసభ్యులు ఆమెను తీసుకొచ్చి అత్తారింట్లో వదిలేసి వెళ్లారు. కానీ అదే రోజు రాత్రి ఇద్దరు చిన్నారులను మెత్తతో ఊపిరాడకుండా చేసి ఐశ్వర్య చంపేసింది. అనంతరం ఆమె కూడా ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.




## 'పెద్ది' రన్‌టైమ్‌పై క్లారిటీ.. ఆ వార్తలన్నీ పుకార్లేనన్న చిత్ర యూనిట్!

రామ్‌చరణ్, బుచ్చిబాబు కాంబోలో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'పెద్ది' గురించి సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లకు చిత్ర యూనిట్ చెక్ పెట్టింది. సినిమా నిడివి విషయంలో జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తూ అధికారికంగా క్లారిటీ ఇచ్చింది. గత కొన్ని రోజులుగా పెద్ది సినిమా నిడివి 3 గంటలకు పైగా ఉంటుందని నెట్టింట వార్తలు చక్కర్లు కొడుతున్న సంగతి తెలిసిందే. ఈ విషయంపై టీమ్ స్పందిస్తూ.. 'ప్రస్తుతానికి ఫస్టాఫ్ ఎడిటింగ్ మాత్రమే పూర్తయింది. సెకండ్ హాఫ్ షూటింగ్ ఇంకా కొనసాగుతోంది. అలాంటప్పుడు నిడివి గురించి వస్తున్న వార్తల్లో నిజం లేదు' అని స్పష్టం చేసింది. సినిమా పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఎడిటింగ్ టేబుల్ మీద ఉన్నప్పుడు ఇలాంటి పుకార్లను నమ్మవద్దని కోరింది.




## అడల్ట్ కంటెంట్ ఉన్నా.. ఫ్యామిలీతో చూడొచ్చు..

యూత్ ఫుల్ ఎంటర్టైనర్‌గా రాబోతున్న చిత్రం 'సువర్ణ టెక్స్టైల్స్'. శివకుమార్ రామచంద్రవరపు, డిబోరా డోరిస్ ఫెల్, రాజశేఖర్ అనింగి, విక్రమాదిత్య డాంబర్ ప్రధాన పాత్రల్లో ప్రశాంత్ నామిని రచన దర్శకత్వంలో తెరకెక్కుతోంది. తాజాగా ఈ మూవీ టీజర్‌ను దర్శకుడు వేణు ఉడుగుల రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా హీరో శివకుమార్ మాట్లాడుతూ.. "సువర్ణ టెక్స్టైల్స్'లో నన్ను హైటెక్ సిటీ వీధుల్లో నైటీ వేసుకుని పరిగెత్తించాడు. మంచి జీల్ ఉన్న దర్శకుడు ప్రశాంత్ నామిని.ఎంతో ప్యాషన్‌తో సినిమా తీశాడు. కచ్చితంగా నచ్చుతుంది. యూత్‌కు బాగా కనెక్ట్ అవుతుంది. టీజర్ చూసారుగా ఎవరిని డిజప్పాయింట్ అయితే చేయదు' అన్నారు.దర్శకుడు వేణు ఉడుగుల మాట్లాడుతూ.. టీజర్ చాలా బాగుంది. టీజర్ ఎలా ఉందో సినిమా కూడా అలానే తీస్తే మాత్రం అందరూ మాట్లాడుకునే సినిమా అవుతుంది. ఈ సినిమాతో ప్రశాంత్ నామిని ఓ మంచి దర్శకుడు అవుతాడని చెప్పుకొచ్చారు. దర్శకుడు ప్రశాంత్ నామిని మాట్లాడుతూ... ఇదొక కొత్త జానర్. కొంత అడల్ట్ కంటెంట్ ఉన్నా... ఫ్యామిలీతో కలిసి చూడదగ్గ సినిమా ఇది అని ముగించారు.

## తండ్రి అయిన యంగ్ హీరో

కోలీవుడ్ యంగ్ హీరో హరీష్ కళ్యాణ్ తండ్రి అయ్యాడు. తన జీవితంలో అత్యంత మధురమైన ఘట్టాన్ని సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకుంటూ అధికారికంగా ప్రకటించారు.హరీష్ కళ్యాణ్ భార్య నర్మద ఉదయకుమార్ మార్చి 2న ఆడపిల్లకు జన్మనిచ్చారు. ఈ విషయాన్ని తెలుపుతూ హరీష్ ఒక ఎమోషనల్ నోట్ విడుదల చేశారు. "నా జీవితంలోని అద్భుతమైన విషయాన్ని మీతో పంచుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది. మా జీవితాల్లో కొత్త అధ్యాయం మొదలైంది. మార్చి 2వ తేదీన నర్మదకు, నాకు పాప పుట్టింది. ప్రస్తుతం తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారు" అని రాసుకొచ్చారు. తమ కుటుంబంపై చూపిస్తున్న ప్రేమాభిమానాలకు హరీష్ కృతజ్ఞతలు తెలిపారు. "కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు మాపై చూపిస్తున్న ఆదరణ మాకెంతో ఆనందంగా ఉంది. అందరికీ ధన్యవాదాలు.. ఓం నమశివాయ" అంటూ తన సంతోషాన్ని వ్యక్తపరిచారు. కాగా.. హరీష్ కళ్యాణ్-నర్మద 2022 అక్టోబర్‌లో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. పెళ్లయిన నాలుగేళ్లకు ఈ జంట తల్లిదండ్రులుగా తమ కొత్త ప్రయాణాన్ని మొదలుపెట్టారు. ప్రస్తుతం ఈ యంగ్ హీరో తండ్రి అయ్యారనే వార్త తెలియగానే సోషల్ మీడియాలో అభిమానులు, సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.



## అబుదాబిలో చిక్కుకున్న ఈషా గుప్తా.. మూడు రోజుల తర్వాత ఢిల్లీ చేరుకున్నట్టు పోస్ట్



మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు తారస్థాయికి చేరడంతో అంతర్జాతీయ విమాన రాకపోకలకి ఆటంకం ఏర్పడింది. ఇరాన్ లక్ష్యంగా అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడుల నేపథ్యంలో పలు దేశాలు ఎయిర్‌స్పేస్‌ను మూసివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో బాలీవుడ్ నటి ఈషా గుప్తా అబుదాబిలో చిక్కుకుపోయి, మూడు రోజుల తర్వాత మార్చి 2న సురక్షితంగా ఢిల్లీకి చేరుకుంది. ఇంటికి చేరిన అనంతరం ఆ అనుభవాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఫిబ్రవరి 28న నేను ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాను. మధ్యాహ్నం ఒకటిన్నర ప్రాంతంలో ఎయిర్‌పోర్ట్‌ను మూసివేశారు. చుట్టూ గందరగోళం.. ఏం జరుగుతుందో ఎవరికీ స్పష్టంగా తెలియని పరిస్థితి అని ఈషా తెలిపారు. కొద్ది సేపటికే క్షిపణి దాడుల వార్తలు రావడం ప్రారంభమయ్యాయని, తర్వాతి క్షణంలో ఏం జరుగుతుందో తెలియని భయానక పరిస్థితి నెలకొన్నదని ఆమె పేర్కొన్నారు. అక్కడున్న వారు తమ కుటుంబ సభ్యులతో ఫోన్లలో మాట్లాడుకుంటూ, ఒకరినొకరు ఓదార్చుకుంటూ గడిపారు. ఆ మూడు రోజులు నిజంగా మానసికంగా చాలా కష్టంగా అనిపించాయి అని చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఈషా గుప్తా ప్రశంసించారు. ఎయిర్‌పోర్టులో చిక్కుకున్న ప్రయాణికులకు ప్రత్యేకంగా భోజనం, తాత్కాలిక వసతి ఏర్పాట్లు చేసినట్లు ఆమె వెల్లడించారు. నేను చెక్-ఇన్ పూర్తి చేయకముందే ఎయిర్‌పోర్ట్ మూసివేయడంతో తిరిగి అబుదాబిలోని హోటల్‌కు వెళ్లాను. అక్కడి సిబ్బంది ముఖాల్లో భయం కనిపించినా, ప్రయాణికులకు ఎక్కడా ఒత్తిడి కలగకుండా ఎంతో సమర్థంగా పనిచేశారు అని ఈషా పేర్కొన్నారు. ఇక ఈషా గుప్తాతో పాటు దుబాయ్‌లో తమిళ స్టార్ అజిత్ కుమార్, టాలీవుడ్ నటుడు మంచు విష్ణు, నటి సోనాల్ చౌహన్, బాలీవుడ్ నటి నర్గీస్ ఫక్రీ, బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు కూడా చిక్కుకుపోయినట్లు సమాచారం. ఈషా సురక్షితంగా భారత్ చేరుకోవడంతో అభిమానులు ఊపిరిపీల్చుకున్నప్పటికీ, మిగిలిన వారంతా సురక్షితంగానే ఉన్నారనే అధికారిక సమాచారం కోసం ఎదురు చూస్తున్నారు.

## నేను ఎవరికీ సపోర్ట్ చేయడం లేదు



ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా పుణ్యమా అని సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాల గురించి రకరకాల వార్తలు పుట్టుకొస్తున్నాయి. ముఖ్యంగా కొందరు యూట్యూబర్లు కేవలం వ్యూస్ కోసం సెలబ్రిటీల ఆస్తుల గురించి, వారి వ్యక్తిత్వం గురించి థంబ్‌నెయిల్స్ పెట్టి తప్పుడు ప్రచారం చేస్తున్నారు.తాజాగా ఇటువంటి చేదు అనుభవం సీనియర్ నటుడు తనికెళ్ల భరణికి ఎదురైంది. గత కొన్ని రోజులుగా యూట్యూబ్‌లో తనికెళ్ల భరణి ఆస్తులకు సంబంధించిన వీడియోలు విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి. తనికెళ్ల భరణి (ుజీనితిఎవశ్రీశ్రీజీ ఃప్తుజీతీజీనితి)ఆస్తులు చూస్తే మైండ్ పోవాల్సిందే అనే రేంజ్‌లో ప్రచారం మొదలైంది. ఆయన ఇంటి ముందు అరడజను ఖరీదైన కార్లు ఉన్నాయని, కోట్లలో ఆస్తులు ఉన్నాయని కొందరు వార్తలు సృష్టించారు. తాజాగా, ఈ పుకార్లపై తనికెళ్ల భరణి ఒక వీడియో ద్వారా చాలా సున్నితంగా, అంతే స్పష్టంగా క్లారిటీ ఇచ్చారు. "నా ఆస్తులు చూసి అందరూ షాక్ అవ్వాల్సిందే అని రాశారు, కానీ ఆ వార్తలు చూసి నేనే షాక్ అయ్యాను" అని ఆయన నవ్వుతూ వ్యాఖ్యానించారు. తన ఇంటి ముందు కార్లు ఉన్నాయని చూపిస్తున్న దృశ్యాల్లో వాస్తవం లేదని, ఆ వార్తలు చూసి తన కుటుంబ సభ్యులంతా కలిసి నవ్వుకున్నామని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాల నేపథ్యంలో, తాను ఏదో ఒక దేశానికి లేదా ఒక మతానికి మద్దతు ఇస్తున్నట్లు వస్తున్న వార్తలను ఆయన తీవ్రంగా ఖండించారు. తాను అన్ని మతాలను, అన్ని వర్గాల ప్రజలను సమానంగా గౌరవిస్తానని స్పష్టం చేశారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com